ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
గురువారం 11 ఏప్రిల్ 2024





అర్ధరాత్రి కరకట్టపై లారీల బారులు

హనిమిరెడ్డి.. ఎక్కడ?

- తుస్సుమన్న జగన్ బస్సుయాత్ర
- అచూకీలేని అద్దంకి వైసీపీ అభ్యర్థి పాణ్యం
- పోటీ విషయంలో విముఖతే కారణమా?



అద్దరోడ్డు వద్ద అభివాదం చేస్తున్న జగన్

బాపట్ల(ఆంధ్రజ్యోతి)/ సంతమాగులూరు, ఏప్రిల్ 10: మేమంతా సిద్ధం అంటూ ముఖ్యమంత్రి జగన్ బస్సుయాత్ర చేపట్టారు. అయితే అద్దంకి నియోజకవర్గంలో అసెంబ్లీ అభ్యర్థి పాణ్యం హనిమిరెడ్డి మాత్రం.. తాను సిద్ధంగా లేనంటూ జగన్ బస్సుయాత్రకు ముఖం చాటేశారు. సంతమాగులూరు మండల పరిధిలో బుధవారం సుమారు 7 కిలోమీటర్లు రోడ్‌షో సాగగా ఎక్కడా హనిమిరెడ్డి కానరాలేదు. జగన్ బస్సుయాత్రలో అభ్యర్థి పత్తాలేకపోవడం చర్చకు దారి తీసింది. మేమంతా సిద్ధం బస్సుయాత్ర బుధవారం పల్నాడు జిల్లాలోకి ప్రవేశించే క్రమంలో అద్దంకి నియోజకవర్గం సంతమాగులూరు క్రాస్‌రోడ్డు మీదగా జగన్ బస్సుయాత్ర సాగింది. జగన్ బస్సుపై నుంచి శ్రేణులకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. అయితే ఎక్కడా అద్దంకి నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి పాణెం హనిమిరెడ్డి జాడే కానరాలేదు. పార్టీ పనులపై అభ్యర్థి హైదరాబాద్ వెళ్లారని అనుచరవర్గం చెబుతున్నప్పటికీ తన నియోజకవర్గం మీదగా సీఎం వెళుతున్నప్పుడు హనిమిరెడ్డి కలవకపోవడం వైసీపీ శ్రేణులనే నిరాశకు గురిచేసింది. పైగా గత కొన్ని రోజులుగా హనిమిరెడ్డి తీరుపై వచ్చిన ఆరోపణలకు బుధవారం నాటి పరిణామాలు బలం చేకూర్చినట్లైందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెం అడ్డరోడ్డు వద్ద ముఖ్యమంత్రి జగన్ బస్సుయాత్ర రోడ్‌షో తుస్సుమన్నది. మండల పరిధిలో సుమారు 7 కిలోమీటర్లు సాగిన రోడ్‌షో వెలవెలపోయింది. హనిమిరెడ్డి ఈ రోడ్‌షోకు మొహం చాటేయడంతో మండల వైసీపీ నాయకులు జనసమీకరణ చేయకుండా మమ అనిపించారు. అడ్డరోడ్డుకు జగన్ బస్సు వచ్చే సరికి వెయ్యి మంది కూడా లేరు. దీంతో అభివాదం చేసిన వెంటనే బస్సులోకి జగన్ వెళ్లిపోయారు.

గతంలోనూ ఒకసారి..

అద్దంకి వైసీపీ అభ్యర్థి ఉన్నట్లుండి నియోజకవర్గం నుంచి మాయమవడం ఇది తొలిసారి కాదు. గతంలోనూ ఒకసారి ఇలానే వైసీపీ శ్రేణులకు అందుబాటులో లేకుండా పోయారు. ఇప్పుడు ఏకంగా సీఎం బస్సుయాత్రకే డుమ్మా కొట్టారు. అద్దంకిలో వైసీపీ శ్రేణుల నుంచే మద్దతు దక్కకపోవడంతో పాటు సిట్టింగ్ టీడీపీ ఎమ్మెల్యే రవికుమార్ రాజకీయ వ్యూహాలతో కొన్ని రోజులుగా హనిమిరెడ్డి ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వైసీపీ నుంచి టీడీపీలోకి పెద్దఎత్తున చేరికలు సాగాయి. ఈ నేపథ్యంలోనే రెండు వారాల క్రితం హనిమిరెడ్డి తాడేపల్లి పెద్దలను కలిసి తాను పోటీ చేయబోనని, అక్కడ పరిస్థితులన్నీ పూర్తి ప్రతికూలంగా ఉన్నాయని వాపోయినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఆర్థిక పరమైన అంశాలు కూడా చర్చకు రాగా నిధుల విషయంలో హామీ ఇచ్చి పంపినట్లు ప్రచారం సాగింది. అయినా నియోజకవర్గంలో ఆయన మొక్కుబడి పర్యటనలు తప్ప చేతులెత్తేశారన్న ప్రచారం ఉంది. ఈ పరిణామాల మధ్య జగన్ బస్సుయాత్ర లో ఆయన జాడ లేకపోవడంతో పోటీపై సొంతపార్టీ శ్రేణుల్లోనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కృష్ణానదిలో.. ఇసుక దొంగలు

కృష్ణానదిలో ఇసుక దొంగలు. అర్ధరాత్రి యథేచ్ఛగా ఇసుకను తోడేస్తున్నారు. కృష్ణమ్మను కుళ్లబొడుస్తున్నా పోలీసు, ఎస్‌ఈబీ అధికారులకు పట్టడంలేదు. అధికారానికి అధికారులు దాసోహయ్యారా.. లేదంటే అనధికారిక వసూళ్లలో నిమగ్నమయ్యారో తెలియడంలేదు కానీ గత కొద్ది రోజులుగా చీకటి పడగానే ఇసుక దొంగలు చెలరేగిపోతున్నారు. బొమ్మువానిపాలెం దగ్గర కరకట్టపై లారీలకు లారీలు బారులు తీరి భారీ యంత్రాలతో ఇసుక దొంగలు ఇసుక తవ్వుకుపోతున్నారు. ఏ అనుమతులూ లేని రీచ్‌లో ఇసుకను తోడేస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటంలేదు. ఎన్నికల కోడ్‌లో ఏ నేతకూ తలొగ్గాల్సిన అవసరం లేదు. అధికార ఇసుక దందాను అధికారులు కట్టడి చేస్తారని ప్రజలు భావించారు. అయితే అందుకు విరుద్ధంగా ఇక్కడి పరిస్థితి నెలకొంది.

- అర్ధరాత్రి అనుమతుల్లేని రీచ్‌లో తవ్వకాలు
- ఎన్నికల కోడ్ సమయంలో అధికారిక దందా
- బొమ్మువానిపాలెం, అన్నవరం రీచ్‌లలో తవ్వకాలు
- వీడియోలు తీసి పంపినా పట్టించుకోని అధికారులు

తెనాలి/కొల్లిపర, ఏప్రిల్ 10: జాతీయ హరిత ట్రిబ్యునల్, రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతి ఉన్న రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలు పగలు మాత్రమే జరగాలి. రాత్రి సమయాల్లో ఇసుక తవ్వకాలు నిషేధం. అయితే ఏకంగా రాత్రి వేళ నిర్భయంగా వందల సంఖ్యలో లారీలకు ఇసుక నింపేసి పంపించేస్తున్నారు. బహిరంగంగానే ఈ దందా నడుస్తున్నా అధికారులు అడ్డుకున్న దాఖలాలే లేవు. కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం, అన్నవరం రీచ్‌లలో ఇసుక దోపిడీ జరుగుతుంది. ఇసుక దందాపై స్థానికులు పోలీసులకు ఎన్నిసార్లు సమాచారం ఇచ్చినా, వీడియోలు తీసి పంపినా ఫలితం లేదు. మీడియాను ఆశ్రయించగా బుధవారం ఆయా రీచ్‌లను పరిశీలిస్తే... ఎటు చూసినా బారులు తీరిన లారీలు, పరిమితికి మించిన లోడ్‌తో వెళుతున్న లారీలు కనిపించాయి. ఇటీవల దుగ్గిరాల మండలం పెదకొండూరు దగ్గర ఇసుక లారీలను పట్టుకుని స్థానికులు పోలీసులకు పట్టించారు. ఆ ఒక్కరోజు ఆపినా, ఆ తర్వాత మళ్లీ తవ్వకాలు, అక్రమ రవాణా యథావిధిగా జరిగిపోతోంది. ఇదే పరిస్థితి కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం, అన్నవరం రీచ్‌లలో కూడా నెలకొంది.

కోడ్ వచ్చినా అధికారిక దందా..

ఇంతకాలం ఎమ్మెల్యేనో, ఎంపీ, మంత్రి పేరుచెప్పి ఇసుక తవ్వుకుపోయారు. ఇప్పుడు అవేమీ కుదరవు. ఏది జరిగినా మా కన్నుసన్నల్లో జరగాల్సిందే. ఇదీ ఇటీవల ఇసుక లారీల యజమానులతో ఓ అధికారి చెప్పిన మాట. ఈ రెండు నెలలూ తాము చెప్పినట్లు వినాల్సిందేనంటూ హుకుం జారీచేసి మరీ ఇసుక తవ్వకాలకు పచ్చజెండా ఊపారు. అంటే ఇదంతా అధికారులకు తెలిసే జరుగుతున్నట్లు అర్థమవుతుంది. బొమ్మువానిపాలెం దగ్గర చీకటిపడితే చాలు.. కరకట్టపై, నదిలో వేసిన గాలు మార్గంలో వందల సంఖ్యలో లారీలు బారులుతీరి ఉంటున్నాయి. నదిలో భారీ ఎక్స్‌కవేటర్లతో ఇసుక తోడుస్తున్నారు. పరిమితికి మించిన లోడుతో ఇసుక లారీలు తరలిపోతున్నాయి. ప్రస్తుతం మున్నంగి రీచ్‌లో తవ్వకాలు ఆగాయి. వారంక్రితం అధికారికంగా రీచ్ తెరుస్తామని ప్రచారం చేసినా ప్రారంభం కాలేదు. పెదకొండూరు రీచ్‌లో తవ్వకాలకు స్థానికులు అడ్డుపడుతుండటంతో బొమ్మువానిపాలెం, అన్నవరం రీచ్‌లో అక్రమ తవ్వకాలకు డిమాండ్ పెరిగింది. దీంతో నిన్నటి వరకు పగలు తవ్వకాలు జరపగా ఇప్పుడు రాత్రివేళల్లో సాగిస్తున్నారు. బొమ్మువానిపాలెం, మనుమాన్ పాలెం వాసులు పోలీసులకు సమాచారం అందించినా అధికారులు పట్టించుకోలేదని వారు వాపోతున్నారు. ఫోన్‌చేసి ఫిర్యాదు చేసినప్పుడు వచ్చి కేకలు వేసి వెళ్లిపోవడం, గంట తర్వాత మళ్లీ తవ్వకాలు సాగడం పరిపాటిగా మారిందని వారు చెబుతున్నారు.

బోర్ల నుంచి నీరు రావటంలేదు

మొక్కజొన్న చేతికొచ్చి, నీటి తడులు పెట్టాల్సిన అవసరం లేకున్నా భూగర్భ జలాలు మరింత అడుగుకుపోయాయి. లంక గ్రామాల్లో వాణిజ్య పంటలకు ఎకరాకు నీటి తడిని అందించాలంటే మొన్నటి వరకు మూడు నుంచి వారం రోజులు పడితే, ఇప్పుడు ఆ మాత్రం కూడా నీరు అందడం లేదు. ఇసుక నిల్వలు ఉన్నా తవ్వుకున్నారంటే పట్టించుకునేవారిమి కాదని, ఇసుక తవ్వటానికి లేకపోయినా, నీరు బయటపడే వరకు పది నుంచి 20 అడుగుల లోతుపెట్టిమరీ తవ్వుకుపోతున్నారని వాపోతున్నారు. దీనివల్ల భూగర్భ జలాలు పూర్తిగా పడిపోయాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిన్నటి వరకు సాధారణ మోటార్లకు నీరు రాకపోతే సబ్‌మెర్సిబుల్, జెట్ మోటార్లు అమర్చామని, ఇప్పుడు వాటికి కూడా నీరు రాకుండా మట్టి, ఇసుక వస్తున్నాయంటున్నారు. ఎన్నికల కోడ్ వచ్చినా ఇసుక తవ్వకాలు ఆగలేదేంటనేది వారి ప్రశ్న. నిన్నటి వరకు నాయకులు తవ్వుకుపోతే, ఇప్పుడు అధికారులు తవ్వుకుపోతున్నారా! అంటూ వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక తవ్వనివ్వని వారికే ఈ సారి ఓటు వేద్దాం!

ఇసుక విచ్చలవిడి తవ్వకాలకు అనుమతివ్వని వారికే ఈ సారి ఓటు వేస్తామని కొల్లిపర మండలంలోని కొన్ని తీర గ్రామాల ప్రజలు తేల్చి చెప్పేందుకు సిద్ధమయ్యారు. ఇందుకు కట్టుబడి ఉందామని తీర్మానించుకున్నట్లు సమాచారం. ప్రచారాలకు వచ్చే అభ్యర్థులకు కూడా ఇదే విషయాన్ని చెప్పాలని వారు నిర్ణయించుకున్నారు. ఈ సారి పార్టీల అభిమానంతో ఓటేస్తే కష్టమని, మన భవిష్యత్ కోసం కఠిన నిర్ణయం తీసుకోవాల్సిందేనని వారి ఆలోచన. ఇసుక దందాతో ఒక్కో ఊరికి ఒకరిద్దరు దోచుకుని లాభపడుతుంటే, మిగిలిన గ్రామాలన్నీ నాశనమవుతున్నాయంటున్నారు. పచ్చని పల్లెల్లో ఇసుక చిచ్చురేపుతోందని, ఇకపై ఇటువంటివి లేకుండా ఉండాలంటే ఇసుక తవ్వకాలు ఆపేవారు కావాలని బొమ్మువానిపాలెం, కొల్లిపర, వల్లభాపురం, అత్తలూరివారిపాలెం, అన్నవరం, అన్నవరపులంక, కొత్తూరులంక తదితర గ్రామాల ప్రజలు తీర్మానించారు. నది మధ్య ఉన్న లంక గ్రామాల ప్రజలు ఈ విషయంలో పట్టుదలగా ఉన్నారని సమాచారం.



కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం-చిలుమూరు మధ్య కరకట్టపై పరిమితికి మించిన లోడుతో అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలు

షర్మిలతో ఆమంచి

- బహిరంగ సభకు హాజరుకావాలని ఆహ్వానం



పీసీసీ చీఫ్ షర్మిలను కలిసిన ఆమంచి కృష్ణమోహన్

చీరాల, ఏప్రిల్ 10: వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ బుధవారం పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలను కలిశారు. ఇది వైసీపీకి ఊహించని షాక్‌గా చెప్పుకుంటున్నారు. మంగళవారం పందిళ్లపల్లిలోని తన నివాసంలో ఆమంచి తన అనుచరులతో ఆత్మీయ సమావేశం నిర్వహించి తాను కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు ప్రకటించారు. ఈనేపథ్యంలో బుధవారం ముఖ్య అనుచరులతో కలసి బెంగళూరులోని షర్మిలను ఆమె నివాసంలో కలిశారు. ముందుగా తనను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించినందుకు ఆమంచి కృతజ్ఞతలు తెలిపారు. తన రాజకీయ ప్రస్థానం కాంగ్రెస్ పార్టీ నుంచి మొదలైనట్లు చెప్పారు. త్వరలో చీరాల నియోజకవర్గంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని, ఆ సభకు రావాల్సిందిగా షర్మిలను ఆయన ఆహ్వానించారు. అందుకు ఆమె సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ఆమంచి వెంట నియోజకవర్గ నాయకులు, ఏఎంసీ మాజీ చైర్మన్ మార్పు గ్రెగోరి, మేడిబోయిన బలరామిరెడ్డి, బండ్ల బాబు, కోటి దాసు, శీలం శ్యామ్, బజ్జిబాబు,షేక్ రెహ్మాన్, ఎంద్రపాటి సునీల్, కంకట శివప్రసాద్ ఉన్నారు.

ఆర్టీసీ.. చలో సిద్ధం

- బస్సులు లేక ప్రయాణికుల పాట్లు
- 41 సర్వీస్‌లకు 26 బస్సులు తరలింపు

బాపట్ల, ఏప్రిల్ 10: మేమంతా సిద్ధం అంటూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి ఎన్నికల ప్రచారం చేపట్టగా.. ఆర్టీసీ ఆయన సేవలో తరిస్తోంది. బుధవారం పిడుగురాళ్ల సమీపంలో సిద్ధం సభ ఏర్పాటు చేశారు. ఈ సభకు జనాన్ని తరలించేందుకు బాపట్ల ఆర్టీసీ డిపో నుంచి 26 బస్సులను తరలించారు. డిపో పరిధిలో మొత్తం 41 సర్వీస్‌లు ఉండగా వాటిలో 24 ఆర్డనరీలు, 2 ఎక్స్‌ప్రెస్ బస్సులను సిద్ధం సభకు కేటాయించారు. దీంతో డిపో పరిధిలో మిగిలిన 15 బస్సులు మాత్రమే అన్నిరూట్లలో తిరగాల్సి వచ్చింది. గంటకు ఒక బస్సు కూడా రాక ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ప్రతిసారి వైసీపీ సభలకు అరకొర ఉన్న బస్సులను తీసుకెళ్లడం.. ఇబ్బందులను పట్టించుకోకపోవడంపై ప్రయాణికులు ఆర్టీసీ అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదే ఆసరాగా ఆటోవాలాలు అధనపు చార్జీలు చేసి ప్రయాణికులను గమ్యస్థానాలకు తరలించారు. బస్సులు లేని కారణంగా తమ జేబుకు చిల్లుపడిందని ప్రయాణికులు వాపోయారు. బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల్లో ప్రయాణికులకు ప్రయాణ కష్టాలు ఎదురయ్యాయి.



పిడుగురాళ్లలో జరిగే సిద్ధం సభకు తరలిస్తున్న ఆర్టీసీ బస్సులు



బస్సుల కోసం బాపట్ల పాతబస్టాండ్‌లో పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు

12న చంద్రబాబు ప్రజాగళం



వేమూరులో టీడీపీ, జనసేన శ్రేణులతో మాట్లాడుతున్న ఆనందబాబు

కొల్లూరు/రేపల్లె, ఏప్రిల్ 10: ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ప్రజాగళం సభ 12వ తేదీ సాయంత్రం 6 గంటలకు పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద జరుతుందని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఉప్పూడి రోడ్డులోని హెలీప్యాడ్ పనులను బుధవారం ఆర్అండ్‌బీ అధికారులు ఎమ్మెల్యే సోదరుడు శివప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాగళం సభకు నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు, ప్రజలు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

- వేమూరు: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు మండల కేంద్రమైన కొల్లూరులో శుక్రవారం ప్రజాగళం రోడ్డు షోను నిర్వహించనున్నట్లు మాజీమంత్రి, వేమూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు కోరారు. బుధవారం సాయంత్రం వేమూరులోని పార్టీ కార్యాలయంలో టీడీపీ, జనసేన శ్రేణుల ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధాహ్నం 3గంటలకు కొల్లూరు గౌడపాలెం వద్ద ప్రజాగళం కార్యక్రమం జరుగుతుందన్నారు. జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, వేమూరు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పూడి రోడ్డులో చంద్రబాబు పర్యటనకు హెలీప్యాడ్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సోదరుడు శివప్రసాద్, ఆర్అండ్‌బీ అధికారులు

ఈద్ ముబారక్

- నేడే ఈద్-ఉల్-ఫితర్ పర్వదినం
- 30 రోజుల ఉపవాస దీక్షల విరమణ
- ఫిత్రా రూ.100గా నిర్ణయం
- విద్యుత్ వెలుగుల్లో మసీదులు

రేపల్లె, ఏప్రిల్, 10: గుంటూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బుధవారం సాయంత్రం ఆకాశంలో నెలవంక (చంద్రోదయం) దర్శనమిచ్చింది. దీంతో గురువారం రంజాన్ పర్వదినాన్ని జరుపుకోవచ్చని ముస్లిం మత పెద్దలు ప్రకటించారు. దీంతో ముస్లింలు 30 రోజులుగా చేసిన కఠిన ఉపవాస దీక్షలు వీడి పండుగ పనుల్లో బిజీ అయిపోయారు. రంజాన్ పర్వదినం సందర్భంగా మసీదులు, ఈద్గాలను అంగరంగ వైభవంగా ముస్తాబు చేశారు. ఈ ఏడాది రంజాన్ మాసంలో ఎన్నికల హడావుడి మొదలు కావడంతో రాజకీయ ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. నెలరోజుల పాటు సాగిన రంజాన్ ఉపవాస దీక్షలు, ఇఫ్తార్లలో పలువురు రాజకీయ నేతలు పాల్గొన్నారు. ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. వారికి పలు రకాలుగా సేవలు అందజేశారు.



రేపల్లె లక్ష్మీటాకీస్ సెంటర్లో విద్యుత్ దీపాల వెలుగుల్లో మసీద్

పరోపకారానికి నిదర్శనంగా దాన, ధర్మాలు

ఈదుల్ ఫితర్ పండుగ అత్యున్నత మానవీయ విలువలను, పరస్పర ప్రేమానురాగాలను పెంపొందిస్తుందని ముస్లింలు బలంగా నమ్ముతారు. రంజాన్ నెలలో అత్యధిక దానధర్మాలు చేస్తారు. సంపాదనాపరులైనవారు, సంపన్నులైనవారు రంజాన్ నెలలో జకాత్ అచరించాలని ఖురాన్ బోధిస్తోంది. ఆస్తిలోనుంచి నిర్ణీత మొత్తాన్ని పేదలకు దానం చేయడాన్ని జకాత్ అని అంటారు.

మసీదులకు అలంకరణ...

రంజాన్ పండుగ సందర్భంగా మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. విద్యుత్ వెలుగుల్లో మసీదులు శోభాయమానంగా కన్పిస్తున్నాయి. కొనుగోలుదార్లతో దుకాణాలు కిటకిటలాడాయి. నమాజ్ చేయడానికి వీలుగా ఆయా ప్రాంతాల్లో ఈద్గా వద్ద ప్రత్యేక ఏర్పాట్లు పూర్తయ్యాయి. నమాజు చేసుకోవాడానికి వీలుగా షామియానాలు వేశారు. వజూ చేసుకోవాడానికి వసతి ఏర్పాట్లు చేశారు. ఉదయం పదిగంటలకు ఈద్ నమాజ్ ప్రారంభమవుతుందని మైకుల ద్వారా చెప్పించారు. పండుగ సందర్భంగా ప్రతి ముస్లిం విధిగా ఫిత్రాను ఇవ్వాలి. ఈ ఏడు ఫిత్రాను 100 రూపాయలుగా ప్రకటించారు. ఇంట్లో ఎంతమంది సభ్యులు ఉంటే అంతమంది ఫిత్రా విధిగా ఇవ్వాలి. రంజాన్ సందర్భంగా ప్రతి ఒక్క ముస్లిం జకాత్‌ను ఇవ్వాలి. జకాత్ అంటే తమ ఆదాయంలో పది శాతం ధనాన్ని తీసి, పేద ముస్లింలకు ఇవ్వాలి.

రంజాన్ అంటే..

రమదాన్ అంటే శుభవేళ, ఉత్సవ సమయం అని అర్థం. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం. రమదాన్‌ను వాడుక భాషలో సాధారణ ప్రజలు రంజాన్‌గా పిలుస్తుంటారు. చంద్రమానాన్ని అనుసరించి రూపొందించిన ఇస్లామిక్ క్యాలండరులో తొమ్మిదో నెల 'రంజాన్'. ముస్లింల పవిత్ర గ్రంథమైన ఖురాన్ ఈ మాసంలోనే ఆవిర్భవించిందని ప్రవక్తలు చెప్పడంతో రంజాన్‌ను అత్యంత పవిత్రమైన నెలగా భావిస్తారు. ముప్పై ఉపవాస దీక్షలు పాటించి పదో నెల 'షవ్వాల్' మొదటి రోజున ఈదుల్ ఫిత్ర్ జరుపుకుంటారు. 'చంద్రోదయం(నెలవంక దర్శనం) జరిగితేనే ఈద్- ఉల్- ఫితర్ జరుపుకుంటారు. ఈద్-ఉల్- ఫితర్ నాడు ప్రత్యేకమైన సలాత్(ఇస్లామీయ ప్రార్థన) చేస్తారు. ఈ ప్రార్థనను సమూహంగానే (జమాత్) చేస్తారు. ఈద్గాల వద్ద అందరూ గుమిగూడి దైవానికి కృతజ్ఞతలు సమర్పించుకుంటూ నమాజ్ చేస్తారు.



రేపల్లెలో విద్యుత్ దీపాలతో అలంకరించిన జామియా పెద్ద మసీద్



శివానీగా తమన్నా

'అరణ్మనై' తమిళంలో సూపర్ హిట్ ఫ్రాంఛైజీ. తెలుగులో విడుదలైన అన్ని వర్షెన్లు హిట్ అయ్యాయి. ఈ హారర్ కామెడీ సిరీస్ నాలుగో ఫ్రాంఛైజీ తెలుగులో 'బాక్' పేరుతో వస్తోంది. స్వీయ నిర్మాణంలో సుందర్ సి నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో తమన్నా, రాశి ఖన్నా నటిస్తున్నారు. శివానీ పాత్రను పోషిస్తున్న తమన్నా లుక్ పోస్టర్‌ను బుధవారం విడుదల చేశారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న 'బాక్' చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ సినిమా తెలుగు హక్కుల్ని సొంతం చేసుకున్న ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఈ నెలలోనే భారీగా విడుదల చేయడానికి ప్లాన్ చేస్తోంది. వెన్నెల కిశోర్, శ్రీనివాసులు, ఢిల్లీ గణేశ్, కోవై సరళ కీలక పాత్రలు పోషించారు.

ఎలాంటి సాయానికైనా సిద్ధం

- మల్లు భట్టి విక్రమార్క



నటి అంజలి నటించిన 50వ చిత్రం 'గీతాంజలి మళ్లీ వచ్చింది'. శివ తుర్లపాటి దర్శకత్వం వహించారు. రచయిత కోనవెంకట్, ఎంవీవీ సత్యనారాయణ సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. మంగళవారం సాయంత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ "మధ్య తరగతి వాళ్లని మరో ప్రపంచంలోకి తీసుకెళ్లేదే సినిమా. ప్రభుత్వపరంగా ఇండస్ట్రీకి ఎలాంటి సాయం కావాలన్నా చేసేందుకు సిద్ధం" అని చెప్పారు. దర్శకుడు శివ తుర్లపాటి మాట్లాడుతూ "ఈ మూవీలో ఇంటర్వెల్, క్లైమాక్స్‌ను అస్సలు మిస్ అవ్వద్దు" అని అన్నారు. నిర్మాత కోనవెంకట్ మాట్లాడుతూ "గీతాంజలి చిన్న కాన్సెప్ట్‌తో తీశాం. పెద్ద హిట్ అయ్యింది. సీక్వెల్ కూడా సూపర్ సక్సెస్ సాధిస్తుంది" అని ధీమా వ్యక్తం చేశారు. హీరోయిన్ అంజలి మాట్లాడుతూ "మొదటి భాగం కంటే రెండో భాగం మరింత ఎంటర్టైన్ చేస్తుంది" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో రచయిత విజయేంద్రప్రసాద్, సిద్ధు జొన్నలగడ్డ, డైరెక్టర్స్ వశిష్ఠ, నందినిరెడ్డి, హేమంత్ మధుకర్, నిర్మాత టీజీ విశ్వప్రసాద్ పాల్గొన్నారు.

మే 4న ఘనంగా డైరెక్టర్ డే వేడుకలు



దర్శకరత్న దాసరి నారాయణరావు జయంతి (మే 4)ని తెలుగు దర్శకుల సంఘం డైరెక్టర్స్ డే గా సెలబ్రేట్ చేస్తోంది. ఈ ఏడాది మరింత భారీగా ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్నారు. ఈ వివరాలను అసోసియేషన్ అధ్యక్షుడు వీరశంకర్ వెల్లడిస్తూ ' డైరెక్టర్స్ డే ను ఎల్బీ స్టేడియంలో భారీగా నిర్వహించడం ఇదే మొదటి సారి. ఈ ఈవెంట్ ద్వారా వసూలయ్యే మొత్తాన్ని అసోసియేషన్ సంక్షేమం కోసం వినియోగిస్తాం. ఈ ఈవెంట్ నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన కమిటీలో అనిల్ రావిపూడి, శివ నిర్వాణ, నందిని రెడ్డి తదితరులు ఉంటారు. పరిశ్రమలోని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానిస్తున్నాం' అన్నారు. దర్శకుల సంఘానికి ఇదొక బెంచ్ మార్క్ ఈవెంట్ అవుతుందని నందినీ రెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమం గురించి చెప్పగానే త్రివిక్రమ్, సుకుమార్ వంటి పెద్ద దర్శకులందరూ సపోర్ట్ చేయడానికి ముందుకు వచ్చారని సాయి రాజేశ్ చెప్పారు. గతంలో వజ్రోత్సవాలు ఏ స్థాయిలో జరిగాయో అంత ఘనంగా డైరెక్టర్స్ డే ను సెలబ్రేట్ చేస్తామని వశిష్ఠ చెప్పారు.

ఆధ్యాత్మికం.. సాహసోపేతం

అభిషేక్ పిక్చర్స్ అధినేత అభిషేక్ నామా దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'నాగబంధం'. ది సీక్రెట్ ట్రెజర్.. అనేది ట్యాగ్‌లైన్. ఆధ్యాత్మిక, సాహసోపేతమైన అంశాలు కలిగిన ఓ పవర్‌ఫుల్ స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారు అభిషేక్ నామా. కేజీఎఫ్‌లో నటించిన అవినాష్‌ను అఘోరా పాత్రలో పరిచయం చేస్తూ ఓ వీడియో విడుదల చేశారు. హై బడ్జెట్‌తో, అద్భుతమైన



విజువల్స్‌తో సాహసాల ప్రపంచంలోకి ఈ సినిమా తీసుకెళుతుందని నిర్మాత మధుసూదన్‌రావు చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: అబే. ఫొటోగ్రఫీ: సౌందర్‌రాజన్ ఎస్, సమర్పణ: దేవాన్ష్ నామా.

మళ్లీ అదే రోజున..



నిజాయితీ కలిగిన న్యూస్ రిపోర్టర్‌గా నారా రోహిత్ నటించిన 'ప్రతినిధి 2' చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. సరిగ్గా పదేళ్ల క్రితం 'ప్రతినిధి' చిత్రం కూడా ఏప్రిల్ 25నే విడుదల కావడం విశేషం. నారా రోహిత్ తన ఇంటెన్స్ యాక్టింగ్‌తో ఆకట్టుకుంటారని దర్శకుడు మూర్తి చెప్పారు. సిరీ లెల్లా హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రాన్ని కుమార్ రజాబత్తుల, ఆంజనేయులు శ్రీ తోట, సురేంద్రనాథ్ బొల్లినేని నిర్మించారు.



భారీ మొత్తం చెల్లించి...

జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్నారు. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా, సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. మిక్కిలినేని సుధాకర్, కె హరికృష్ణ నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా తెరకెక్కుతోన్న ఈ చిత్రం ఫస్ట్ పార్ట్ అక్టోబర్ 10న విడుదలవుతోంది. ఈ సినిమా ఉత్తరాది థియేట్రికల్ రైట్స్‌ను ధర్మ ప్రొడక్షన్స్ అధినేత కరణ్ జోహార్, ఏఏ ఫిల్మ్స్ ఫౌండర్ అనిల్ తడాని భారీ మొత్తం చెల్లించి సొంతం చేసుకున్నారు.
ఈ క్రేజీ డీల్‌తో నార్త్‌లోనూ 'దేవర' చిత్రం కలెక్షన్ల సునామీ సృష్టిస్తుందని చిత్ర బృందం, అభిమానులు ఆశిస్తున్నారు.

నేడు వేల్పూరుకు నారా భువనేశ్వరి..

వేల్పూరు (శావల్యాపురం) ఏప్రిల్10: 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి గురువారం సాయంత్రం 8గంటలకు శావల్యాపురం మండలంలోని వేల్పూరు గ్రామానికి విచ్చేయుచున్నట్లు పల్నాడుజిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక గుండెపోటుతో మరణించిన వేల్పూరు గ్రామానికి చెందిన తెలుగు యువత సభ్యుడు బోయపాటి మణికంఠ కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు భువనేశ్వరి వేల్పూరుకు రానున్నట్లు తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

కొలకలూరుకు నారా భువనేశ్వరి ..

నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా నారా భువనేశ్వరి గురువారం కొలకలూరు రానున్నారు. అక్రమ కేసులతో చంద్రబాబును జైలుకు పంపడాన్ని తట్టుకోలేక మనోవేధనతో మృతి చెందిన కొలకలూరు గ్రామానికి చెందిన టీడీపీ వీరాభిమాని దాచేపల్లి శివరామయ్య కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించనున్నారు. సాయంత్రం 5.30 గంటలకు భువనేశ్వరి కొలకలూరు చేరుకోనున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఘన స్వాగతం పలికేందుకు టీడీపీ నేతలతోపాటు కూటమి శ్రేణులు సన్నద్ధం అవుతున్నారు..



హెలిప్యాడ్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న నక్కా ఆనందబాబు, డీఎస్పీ మురళీకృష్ణ

రాక్షస పాలనకు త్వరలో అంతం

● వేమూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు

కొల్లూరు, ఏప్రిల్ 10: రాష్ట్రంలో రాక్షస పరిపాలన అంతమొందించేందుకు ప్రజలంతా వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్నారని మాజీ మంత్రి, వేమూరు నియోజకవర్గ అభ్యర్థి నక్కా ఆనందబాబు అన్నారు. ఈ నెల 12వ తేదీన కొల్లూరులో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఇందుకోసం అనువైన ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఎంప్లాయీస్ రిక్రియేషన్ క్లబ్‌లో ఆనందబాబు మాట్లాడుతూ వైసీపీకి అభ్యర్థులు దొరకడం లేదన్నారు. వారానికి ఒక అభ్యర్థి మారిపోతున్నారని, ఆపార్టీకి అభ్యర్థులు కరువై ఒకే ఇంటిలో ఇద్దరు ముగ్గురు అభ్యర్థులు నిలబెట్టాల్సిన పరిస్థితి ఆ పార్టీకి దాపురించిందన్నారు. టీడీపీ కూటమికి మాత్రం అభ్యర్థులు ఎక్కువై సర్దుకోవాల్సిన పరిస్థితి చూస్తున్నామని చెప్పారు. ఎన్నికల్లో మద్యం పంపిణీ చేసేందుకు అధికార పార్టీ మద్యం భారీగా నిల్వ చేసిందని, ఎన్నికల సంఘం నిల్వలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకోవాలని అధికార పార్టీ నాయకులు చేస్తున్న దుర్మార్గాలపై ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి సారించి వాటిని అరికట్టాలని కోరారు. శుక్రవారం మధ్యాహ్నం కొల్లూరులో 3 గంటలకు పార్టీ అధినేత చంద్రబాబు బహిరంగ సభకు వేమూరు నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో నియోజకవర్గ జనసేన అధ్యక్షులు ఊసా రాజేష్, టీడీపీ నాయకులు మైనేని మురళీకృష్ణ, డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్, సుంకర రాంబాబు, జనసేన మండల కన్వీనర్ బొందలపాటి చలమయ్య, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచార వాహనం ధ్వంసం ఘటనలో ముగ్గురిపై కేసు

రెంటచింతల, ఏప్రిల్ 10: నరసరావుపేట కూటమి ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలుకు చెందిన డిజిటల్ వాహనాన్ని ధ్వంసం చేసిన కేసుకు సంబంధించి ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ కేవీ నారాయణరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సంఘటన మండలంలోని మంచికల్లులో మంగళవారం రాత్రి చోటుచేసుకోగా టీడీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాహనం ధ్వంసంచేసిన వారిలో దీకొండ ఆంజనేయులు, దమ్ము అంజిబాబు, అంజిరెడ్డి ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిరంకుశ వైసీపీని ఓడించండి

● కూటమి ఎంపీ, అసెంబ్లీ అభ్యర్థులు లావు, జీవీ

● ఎన్నికల ప్రచారంలో అడుగడుగునా ఘన స్వాగతం



ఉప్పలపాడులో టీడీపీలో చేరిన వారితో కూటమి అభ్యర్థులు శ్రీకృష్ణ దేవరాయలు, జీవీ ఆంజనేయులు

నూజెండ్ల, ఏప్రిల్ 10: రానున్న ఎన్నికల్లో నిరంకుశ వైసీపీని ఓడించాలని, ప్రజా కూటమిని గెలిపించాలని నరసరావుపేట ఎంపీ అభ్యర్థి శ్రీకృష్ణ దేవరాయలు, వినుకొండ నియోజవర్గ అసెంబ్లీ అభ్యర్థి జీవీ ఆంజనేయులు పిలుపునిచ్చారు. నూజెండ్ల మండలంలోని పాత ఉప్పలపాడు, గుర్రపునాయుడుపాలెం, నూజెండ్ల, లక్ష్మీపురం, కొత్తరెడ్డిపాలెం, రవ్వవరం, మేకపాడు, బుర్రిపాలెం, పాతరెడ్డిపాలెం, ముత్తరాసువారిపాలెం, పమిడిపాడు, కంభంపాడు, తెల్లబాడు, పీ అన్నవరం, ఐన వోలు, చింతలచెరువు, మృత్యుంజాపురం గ్రామాల్లో బుధవారం టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కూటమి అభ్యర్థులైన లావు శ్రీకృష్ణదేవరాయలు, జీవీ ఆంజనేయులు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ఎన్నికల ప్రచారానికి వచ్చిన నేతలకు గ్రామ గ్రామాన మహిళలు హారతులు ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ప్రజలు నాయకులు చేసిన అభివృద్ధిని గుర్తించి ఆదరిస్తారన్నారు. నూజెండ్ల ప్రాంత అభివృద్ధికి రైతులకు రెండు పంటలు సాగు చేసుకొనేందుకు అవసరమైన గుండ్లకమ్మ నదీ జలాలు సద్వినియోగం చేసుకొనే విధంగా ఎత్తిపోతల పథకాలకు ప్రాధాన్యం ఇచ్చి పూర్తిచేస్తామన్నారు. వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును ఓడించి అహంకారం, నిరంకుశ పోకడలను నివారించాలన్నారు. జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి తప్పా వైసీపీ చేసిన అభివృద్ధి ఏమి లేదన్నారు. బ్రహ్మనాయుడు నియోజకవర్గంలో ఇసుక, బియ్యం, మద్యం తదితర అక్రమాలను ప్రోత్సహించి రియల్‌ఎస్టేట్ వ్యాపారిగా మారారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటం ద్వారా ఆరు గ్యారెంటీలతో రాష్ట్రంని అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి పునాది పడుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, బీజేపీ నేతలు మేడం రమేష్, ఎండ్లూరి వీరయ్య, జనసేన నేతలు నిశ్శంకరరావు శ్రీనివాసరావు, కొంజేటి నాగశ్రీను రాయల్, మండల పార్టీ అధ్యక్షులు మీసాల మురళీకృష్ణ యాదవ్, టీడీపీ నేతలు ముండ్రు సుబ్బారావు, లగడపాటి వెంకటరావు, బొట్ల అంజయ్య, రొడ్డా వీరాంజనేయరెడ్డి, నక్కా బుల్లీశ్వరరెడ్డి, గంగినేని ఆంజనేయులు, బచ్చు అంజిరెడ్డి, బత్తిన సుబ్బారావు, పవన్‌కుమార్, కొమ్మా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగన్ కుట్రలను ముస్లింలు గమనించాలి

● చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు



ముస్లింల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్10: రాష్ట్రంలో ముస్లింల నమ్మకం చంద్రబాబు, టీడీపీ మాత్రమేనని, ఈ విషయాన్ని మరుగున పరచి విభజించి పాలించాలని చూస్తున్న వైసీపీ కుట్రలను గమనించి అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు ముస్లింలకు సూచించారు. బుధవారం పట్టణంలోని ప్రత్తిపాటి గార్డెన్స్‌లో ముస్లింల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా ముస్లింలకు ప్రత్తిపాటి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. దువా చదివి చిలకలూరిపేట శాసనసభ్యునిగా తనను, పార్లమెంట్ అభ్యర్థి అయిన లావు శ్రీకృష్ణ దేవరాయులను గెలిపించేందుకు ఆశీస్సులు అందించాలనికోరారు. నిజానికి ఎన్‌ఆర్‌సీ, సీఏఏ, త్రిపుల్ తలాక్, కాశ్మీర్‌కు సంబంధించి 370 ఆర్టికల్‌పై లోక్‌సభ, రాజ్యసభల్లో బలపరిచింది వైసీపీనే అని మండిపడ్డారు. టీడీపీ ప్రస్థానంలో ముస్లింలకు ఏనాడూ నష్టం జరగలేదని స్పష్టం చేశారు. ముస్లింలకు ప్రత్యేక బడ్జెట్, ఏటా రంజాన్ తోఫా, హైదరాబాద్‌లో హజ్‌హౌస్‌తో పాటు రూ.25 కోట్లతో కడపలోను హజ్‌హౌస్ నిర్మాణానికి కృషి చేశామన్నారు. మసీదుల్లో ఇమామ్‌లకు రూ.5వేలు, మౌజమ్‌లకు రూ.2వేలు గౌరవవేతనం ఇచ్చింది టీడీపీయేనని, మసీదులు, దర్గాల మరమ్మత్తులకు, శ్మశాన వాటికలకు రూ.50 కోట్ల గ్రాంటు ఇచ్చామని, ముస్లింల నాలుగు శాతం రిజర్వేషన్ కోసం ఆరు కోట్లు ఖర్చు చేసి కాపాడింది చంద్రబాబు అన్నారు. రేపు కూటమి ప్రభుత్వం రాగానే ముస్లింలకు మరింత సంక్షేమం అందించి తీరతామని పుల్లారావు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త తోట రాజారమేష్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కన్నా

పల్నాడుకు జగన్ చేసిందేమీ లేదు

● సత్తెనపల్లి కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఏప్రిల్ 10: పల్నాడు జిల్లా ప్రజలను ఓట్లు అడిగే హక్కు వైఎస్ జగన్‌కు లేదని సత్తెనపల్లి నియోజకవర్గ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల్లో పల్నాడుజిల్లాకు చేసిన అభివృద్ధి ఏమిలేదన్నారు. పల్నాడుజిల్లాలో హత్యలు, మాన భంగాలు, మైనింగ్, ఇసుక, గంజాయి మాఫియా పెరిగిందన్నారు. పల్నాడు జిల్లాలో దొంగనోట్లు కూడా ముద్రిస్తున్నారన్నారు. గోదావరి-పెన్నా నదుల అనుసంధానానికి సంబంధించిన మెటీరియల్ నిరుపయోగమై ప్రజాధనం దుర్వినియోగం అవుతుందన్నారు. మిర్చి పంట ఆరు తడులకు నీరివ్వలేని పరిస్థితుల్లో మంత్రి, సీఎం ఉన్నారన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సూపర్-6 పథకాలను, బీసీ డిక్లరేషన్‌ను అమలు చేస్తామన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పటం ఖాయమన్నారు. సమావేశంలో మునిసిపల్ మాజీ చైర్మన్ ఎలినేడి రామస్వామి, నాయకులు ఆతుకూరి నాగేశ్వరరావు, జానీ ఖాజావలి, కట్టా శంకరరావు, పూజల వెంకట కోటయ్య, శిరిగిరి శ్రీనివాసరావు, తవిటి భవన్నా రాయణ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ పదవికి, వైసీపీకి

సత్యనారాయణరెడ్డి రాజీనామా

మాచర్లరూరల్, ఏప్రిల్ 10: జిల్లా కోపరేటివ్ మాచర్ల సొసైటీ చైర్మన్, వైసీపీ నేత గుత్తికొండ సత్యనారాయణరెడ్డి బుధవారం తన పదవికి, వైసీపీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. సొసైటీ చైరన్ పదవి రాజీనామా పత్రాన్ని జిల్లా కోపరేటివ్ అధికారికి పంపారు. మాచర్ల మండలం జమ్మలమడకు చెందిన సత్యనారాయణ వైసీపీలో కీలకంగా వ్యవహరించారు. కాగా ఈయన తన అనుయాయులతో కలిసి టీడీపీలో చేరనున్నట్లు సమాచారం.

ఏపీ ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ సీడ్ డీలర్స్ అసోసియేషన్

రాష్ట్ర అధ్యక్షుడిగా 'వజ్రాల'

గుంటూరు సిటీ, ఏప్రిల్ 10: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ అండ్ సీడ్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా వజ్రాల వెంకట నాగిరెడ్డి రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 14న గుంటూరులోని ఫర్టిలైజర్స్ కల్యాణ మండపంలో జరిగే రాష్ట్ర జనరల్‌బాడీ సమావేశంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అసోసియేషన్ ప్రధానకార్యదర్శిగా ఎస్.అశోకానందరెడ్డి, కోశాధికారిగా కే. విజయకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వైసీపీ అభ్యర్థి ప్రచారంలో వలంటీర్

చుండూరు ఏప్రియల్ 10 : వైసీపీ అభ్యర్థి ఎన్నికల ప్రచారంలో వలంటీర్ పాల్గొన్న ఘటన బుధవారం నడిగ్డపాలెం గ్రామంలో జరిగింది. మండలంలోని నడిగడ్డపాలెంకు చెందిన వలంటీర్ షేక్ కరిముల్లా బుధవారం ఉదయం ఆ గ్రామానికి వైసీపీ అభ్యర్థి ప్రచారానికి రాగా కరిముల్లా అతని వెంట ఉండి ఇంటింటికి తీసుకువెళ్ళి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న వారిని పరిచయం చేసి ఓటు వేయాలని అభ్యర్థించాడు. ఇది గుర్తించిన టీడీపీ నేతలు ఎన్నికల అధికారులకు ఆధారాలతో ఫిర్యాదు చేశారు.

గుంటూరు ఎంపీగా

సీఎం జగన్ పోటీ చేయాలి

● ఇప్పటికే పలువురు అభ్యర్థులను వైసీపీ మార్చారని ఎద్దేవ

● ఆదాయం కోసం మద్యం రేట్లు పెంచిన ఘనుడు జగన్‌రెడ్డి

● తాడికొండ ఎన్నికల ప్రచారంలో పెమ్మసాని చంద్రశేఖర్



దామరపల్లిలో రోడ్ షో నిర్వహిస్తున్న పెమ్మసాని, శ్రావణ్‌కుమార్

తాడికొండ, ఏప్రిల్10: గుంటూరు వైసీపీ ఎంపీగా జగన్మోహన్‌రెడ్డి పోటీ చేసి తనపై గెలవాలని టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ సవాల్ విసిరారు. బుధవారం సాయంత్రం తాడికొండ మండలం దామరపల్లి, పొన్నెక ల్లు గ్రామాల్లో గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, తాడి కొండ ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నెకల్లులో ఏర్పాటుచేసిన సభలో పెమ్మసాని మాట్లాడారు. ఇప్పటికే గుంటూరు వైసీపీ ఎంపీ అభ్యర్థులు పలువురిని మార్చారని ఎద్దేవ చేశారు. ఎంపీగా పోటీ చేయటానికి వైసీపీ అభ్యర్థులు దొరకటం లేద న్నారు. జగన్‌కు ధైర్యం ఉంటే తనపై పోటీ చేయాలని సవాల్ చేశారు. రాష్ట్రాభివృద్ధి చేయటంచేతకాక మద్యాన్ని ఆదాయ వనరుగా చేసుకొని మద్యం రేట్లు పెంచి మందుబాబుల జేబులు గుల్ల చేస్తున్నారన్నారు. టీడీపీ హాయంలో 160 కంపెనీలు రాష్ట్రానికి వస్తే వాటిని తన్ని తరిమేశారన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశాడన్నారు. ఎన్నికల ముందు రాజధాని ఇక్కడే ఉంటుందని ప్రజలను నమ్మబలికి మోసం చేశారన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు లేకుండా చేశా డన్నారు. మట్టి, మైనింగ్, ఇసుక, అక్రమ మద్యంతో రాష్ట్రాన్ని దోచుకున్నా రన్నారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రజలు వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను గుర్తుంచుకొని రాష్ట్రాభివృద్ధి కోసం పాటుపడే చంద్రబాబునాయుడుని సీఎం చేయాలని కోరుకున్నారు. ముందుగా దామరపల్లి గ్రామంలోని వాటర్‌ట్యాంక్ నుంచి రోడ్ షో నిర్వహించారు. రైతులు ట్రాక్టర్లతో ర్యాలీని చేపట్టారు. అనం తరం పొన్నెకల్లు శివారులో టీడీపీ శ్రేణులు, మహిళలు పెమ్మసాని చంద్రశేఖర్, తెనాలి శ్రావణ్‌కుమార్‌కు ఘనస్వాగతం పలికారు. తీన్మార్ తప్పెట్లతో, పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. అనంతరం పొన్నెకల్లు గ్రామంలోని ఎస్సీ కాలనీలో ప్రచారం నిర్వహించారు. విద్యార్థినులు ఆయనతో సెల్ఫీలు దిగారు. కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలవేసి నివాళి అర్పించారు. గ్రామంలోని రోడ్ షో నిర్వహించి ఓట్లు అభ్యర్థించారు. వైసీపీ నుంచి 20 కుటుంబాలు టీడీపీలో చేరారు. పెమ్మసాని చంద్రశేఖర్, శ్రావణ్‌కుమార్‌లు వారికి పసుపుకండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో డాక్టర్ నిమ్మల శేషయ్య, తలశిల ప్రసన్నకుమార్, గుంటుపల్లి మధుసూదనరావు, కంచర్ల శివరామ య్య, చిగురుపాటి అనూప్, తాటి తులసీరామ్, గడ్డిపాటి సాంబశివ రావు, జనసేన నాయకులు విజయ్‌శేఖర్, గులకవరపు నరేష్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పొన్నెకల్లులో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న పెమ్మసాని, శ్రావణ్‌కుమార్



ఛత్రియా నాయక్‌ను పరామర్శిస్తున్న బ్రహ్మారెడ్డి

పోలీస్‌స్టేషన్లను శాసిస్తున్న హోంగార్డులు

● ఎస్పీకి సవాల్ విసురుతున్న పిన్నెల్లి సోదరులు

● ఛత్రియానాయక్‌ను పరామర్శించిన జూలకంటి బ్రహ్మరెడ్డి

మాచర్లటౌన్, ఏప్రిల్ 10: మాచర్ల నియోజకవర్గంలో హోంగార్డులు పోలీస్‌స్టేషన్లను శాసిస్తున్నారని, వీరు చెప్పిందే సీఐలు పాటించాల్సిన దుస్థితి నెలకొందని, నియోజకవర్గంలో నిత్యం అలజడులు సృష్టిస్తూ నూతన ఎస్పీకి పిన్నెల్లి సోదరులు సవాల్ విసురుతున్నారని కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. బుధవారం సిద్ధం సభకు రాను అన్నాడనే అక్కసుతో మండలంలోని అచ్చమ్మకుంట తండాకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్, వలంటీర్లు దాడి చేసి గాయపరిచిన బాణావత్ ఛత్రియా నాయక్ పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఆయన పరామర్శించారు. బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ దీర్ఘకాలికంగా మాచర్ల నియోజకవర్గంలో పోలీస్‌స్టేషన్లలో పని చేస్తూ వైసీపీ తొత్తులుగా వ్యవహరిస్తున్న హోంగార్డులు బాధితులు ఫిర్యాదు చేయడానికి పోలీస్‌స్టేషన్‌కు వస్తే ఆ సమాచారాన్ని వైసీపీ నేతలకు చేరవేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరగాలంటే పోలీస్‌స్టేషన్లలో కింది స్థాయి నుంచి పైస్థాయి వరకు ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. న్యాయం కోసం ప్రజలు పోలీసుల వైపు ఆశగా ఎదురుచూస్తున్నారని, పిన్నెల్లి సోదరులపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. పిన్నెల్లి సోదరులు ముస్లిం నేతలను లక్ష్యంగా పెట్టుకొని గతంలో బక్రీదు పర్వదినం సందర్భంగా అన్వర్ అనే టీడీపీ సీనియర్ కార్యకర్తపై తప్పుడు కేసులు బనాయించి వారి కుటుంబంలో పండుగ లేకుండా చేశారన్నారు. వైసీపీ నేతలు వారిపై వారే దాడి చేసుకొని గాయపడితే టీడీపీకి చెందిన మోసిన్, నాసిర్, ముజఫర్, గౌరె జానిలపై అక్రమ కేసులు బనాయించి రంజాన్ పండుగకు దూరంగా ఉంచారని ఆవేదన వ్యక్తం చేశారు. వెల్దుర్తి మండలం కండ్లకుంటలో బీసీలపై, కొత్తపుల్లారెడ్డిగూడెంలో ఎస్టీలపై, మాచర్ల మండలం అచ్చమ్మకుంటతో ఎస్సీలపై, కారంపూడి మండలం కాకానివారిపాలెంలో ఎస్సీలపై, రెంటచింతల మండలం మంచికల్లులో ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు వాహనం ధ్వంసం చేయడం వంటివి చూస్తే శాంతి భద్రతలు ఎలా ఉన్నాయో ఇట్టే అర్థమవుతుందన్నారు. ఆయన వెంట ధారునాయక్, కేశవరెడ్డి, మురళి, గురవారెడ్డి, బాలునాయక్, రెడ్యానాయక్, రాంనాయక్, శ్రీనునాయక్ తదితరులు ఉన్నారు.



సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రైతుసంఘ నేతలు, నిర్వాహకులు

వాస్తవ ఘటనలకు ప్రతిరూపాలు నాటికలు

● రాష్ట్ర రైతుసంఘం నాయకులు కృష్ణయ్య

● నాలుగో రోజూ కొనసాగిన నాటకోత్సవాలు

యడ్లపాడు, ఏప్రిల్ 10: నిత్య జీవితంలో జరిగే వాస్తవ ఘటనలకు ప్రతిరూపాలు పరిషత్ నాటికలని రాష్ట్ర రైతుసంఘం నాయకులు కృష్ణయ్య అన్నారు. యడ్లపాడు పుచ్చలపల్లి సుందరయ్య కళాపరిషత్, లింగారావుపాలెం కొండవీటి కళాపరిషత్‌లు సంయుక్తంగా నిర్వహిస్తున్న జాతీయస్థాయి నాటకోత్సవాలు నాలుగవ రోజైన బుధవారం రాత్రి కూడా కొనసాగాయి. యడ్లపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య కళాప్రాంగణంలోని ఎంవి చౌదరి కళావేదికపై నిర్వహించిన నాటకోత్సవాలకు ముందుగా కమ్యూనిస్టు గాంధీ పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు నాటికలను వీక్షించడం ద్వారా సమాజంలో జరిగే ఎన్నో విషయాలను తెలుసుకోవచ్చన్నారు. అనంతరం వరుసగా మూడు నాటికలు ప్రదర్శించబడ్డాయి. ప్రతి నాటిక అనంతరం లక్కీడీప్ ద్వారా పది మంది ప్రేక్షకులకు నిర్వాహకులు బహుమతులు అందచేశారు. వేదిక, పుచ్చలపల్లి సుందరయ్య కళాపరిషత్ అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు విజయ్‌కుమార్, రాధాకృష్ణ, సుందరయ్య కళాపరిషత్ కమిటీ సభ్యులు ఎస్.కాళిదాసు, జె.శంకరం, ఎం పద్మారావు, కొండవీటి కళాపరిషత్ అధ్యక్షులు కట్టా శ్రీహరి, టి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రేక్షకులను ఆలోచింపచేసిన నాటికలు

ఆడపిల్లలను బ్రతకనిద్దాం.. బ్రతికించుకుందాం అంటూ సందేశాన్నిచ్చిన నాటిక 'క్షేత్రం' ఆరాధన ఆర్ట్స్ అకాడమీ, గుంటూరు వారు ప్రదర్శించిన ఈ నాటికను ఆకురాతి శిల్ప రచించగా జివి మనహోర్ దర్శకత్వం వహించారు. అనంతరం హెరాయిన్ వంటి మత్తుపదార్థాల నుంచి యువతకు 'విముక్తి' కలిగించి దేశాన్ని రక్షించుకుందాం అంటూ సందేశాన్నిచ్చిన నాటికను ఉషోదయ కళానికేతన్, కట్రపాడువారు ప్రదర్శించారు. ఈ నాటికను చెరుకూరి సాంబశివరావు రచించి దర్శకత్వం వహించారు. రైతన్న మరో కోణంలో ఆలోచించి పంటకు విశ్రాంతినిస్తే ఏం జరుగుతుందో తెలియజేసే కథనమే 'రైతే రాజు' నాటిక. కంచర్ల సూర్యప్రకాష్ రచనకు కొలా రాధాకృష్ణ దర్శకత్వం వహించిన ఈ నాటికను కళాంజలి, హైదరాబాద్ వారు ప్రదర్శించారు.

జనసేన నేతపై వైసీపీ నాయకుల దాడి

నూజెండ్ల, ఏప్రిల్ 10: జనసేన నాయకులపై వైసీపీ నాయకులు దాడి చేసిన ఘటన మండల కేంద్రం నూజెండ్లలో బుధవారం చోటు చేసుకుంది. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గ్రామంలో ప్రచార కార్యక్రమం నిర్వహించిన సందర్భంలో జనసేన నేత కుమార్ కూడా ప్రచారంలో పాల్గొన్నారు. గ్రామంలో ప్రధాన కూడలి యోగయ్య స్వామి గుడి వద్ద పిడుగురాళ్ళ మేమంతా సిద్ధం సభకు వెళ్ళేందుకు బస్సుల్లో వైసీపీ నాయకులు వేచి ఉన్నారు. అక్కడికి వచ్చిన కుమార్‌పై వైసీపీ నాయకులైన వంగూరి చిరంజీవి దుర్భాష లాడటంతో ఇద్దరి మధ్య వాగ్వాదం మొదలైంది. ఆ సమయంలో చిరంజీవి, వంగూరి ప్రసన్న, ప్రసాదులు తనపై దాడి చేసినట్టు బాధితుడు కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.3.90 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	154, 163,174
చికెన్ విత్ స్కిన్	294.00
చికెన్ స్కిన్ లెస్	304.00

అమరావతితోనే రాష్ట్రాభివృద్ధి

● మూడు ముక్కలాటతో ప్రజా ప్రయోజనాలకు తిలోదకాలు

● 1576వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు



తుళ్లూరులో నినాదాలు చేస్తున్న మహిళలు , రైతులు

తుళ్ళూరు, ఏప్రిల్ 10: అమరావతి రాజధాని అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని 33 వేల ఎకరాలు రాజధాని నిర్మాణానికి భూమినిచ్చిన రైతులు స్పష్టం చేశారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న నిరసన దీక్షలు, ఆందోళనలు బుధవారం నాటికి 1576వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మూడు ముక్కలాటతో వైసీపీ ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలకు తిలోదకాలిచ్చిందన్నారు. సీఎం జగన్‌రెడ్డి అమరావతిపై చేస్తున్న కుట్రలు మానుకోవాలన్నారు. దమ్ముంటే ప్రత్యేకహోదా తీసుకురావడం చేతకాని సీఎం జగన్‌రెడ్డి అమరావతిపై అబాండాలు వేయటం తగదన్నారు. ప్రాంతాలు, కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నాడని ఆరోపించారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం అమరావతి అభివృద్ధి చేయాలని , మూడు రాజధానులు బిల్లు పెట్టకూడదని జగన్ సర్కార్‌కు సూచించినా లెక్కచేయనందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. జై ఆంధ్రప్రదేశ్, బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

1,09,547 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,04,430 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,09,547 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 85,482 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8500	18500
నెంబరు. 5	9000	13500
273	9000	12000
341	8000	16000
4884	9500	13000
సూపర్ 10	–	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	19500
బ్యాడిగి	9000	16000
దేవనూరు డీలక్స్	8000	16500
తెల్లకాయలు	5000	11500

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



ఎంసీసీ, సీవిజిల్ కంట్రోల్‌రూమ్, మీడియా కోఆర్డినేషన్ మోనటరింగ్ కమిటీసెల్ కేంద్రాలను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్ తదితరులు

ఎన్నికల కంట్రోల్‌రూమ్ 24 గంటలు పని చేయాలి

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల, ఏప్రిల్ 10 : ఎన్నికల కంట్రోల్‌రూమ్ 24 గంటలపాటు సమర్థవంతంగా పనిచేసేలా అధికారులు పర్యవేక్షించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. ఎంసీసీ, సి-విజిల్ కంట్రోల్‌రూమ్, మీడియాకోఆర్డినేషన్ మోనిటరింగ్ కమిటీసెల్, సోషల్ మీడియాసెల్, వెబ్ క్యాస్టింగ్, ఎన్నికల గ్రీవెన్స్ సెల్ కంట్రోల్‌రూమ్, 1950 హెల్ప్‌లైన్ కేంద్రాలను ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి కలెక్టర్ బుధవారం పరిశీలించారు. పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన అభ్యర్థులు నామినేషన్ వేయటానికి నూతనంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశ మందిరం, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌టీమ్‌లు వినియోగించే వాహనాలకు ఏర్పాటు చేసిన జీపీఎస్ ట్రాకింగ్ పనితీరు, జిల్లా సరిహద్దులలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు, వెబ్‌క్యాస్టింగ్ పనితీరును నిశితంగా పరిశీలించారు. సువిదయాప్‌లో అనుమతులు కొరకు వచ్చిన దరఖాస్తులు, ధ్రువీకరణపత్రాలను ఆయన తనిఖీ చేశారు. కోడ్ ఉల్లంఘించే అంశాలపై కంట్రోల్‌రూమ్‌లోని నోడల్ అధికారులు నిశిత పరిశీలన ఉంచాలన్నారు. అనుమతులు లేకుండా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రచారాలు నిర్వహిస్తే తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల పరిశీలకులు జిల్లాకు రానున్న నేపథ్యంలో వ్యవసాయ కళాశాలలోని అతిథిగృహం, ఆర్అండ్‌బి అతిథి గృహాలను పరిశీలించారు. కార్యక్రమంలో నోడల్ అధికారులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల సమక్షంలో ర్యాండమైజేషన్ ప్రక్రియ

ఈవీఎం, వివిప్యాట్స్ ర్యాండమైజేషన్ ప్రక్రియ రాజకీయపార్టీల సమక్షంలో ఈనెల 12వ తేదీన నిర్వహిస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయపార్టీల నాయకులతో బుధవారం కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ బాపట్ల సెగ్మెంట్‌ల కింద ఉన్న అన్ని అసెంబ్లీనియోజకవర్గాలకు ఈవీఎం, వివిప్యాట్స్ యంత్రాల కేటాయింపులు ఉంటాయని చెప్పారు. ఈవీఎం, వివి ప్యాట్స్ యంత్రాలు తరలించే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ ఉంటుందన్నారు. ఎన్నికల రోజు ఓటు వేసే ప్రజలకు ఈసీఐ ధ్రువీకరించిన 12 రకాల గుర్తింపుకార్డులను అనుమతిస్తున్నట్లు వివరించారు. జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య, బీజేపీనాయకుడు రామకృష్ణ, కాంగ్రెస్ నాయకుడు డి.రవి, బీఎస్పీ నాయకుడు కాగిత కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు గొలపల శ్రీనివాసరావు, షేక్ మహ్మద్‌గౌస్, వైసీపీ నాయకుడు ఇనగలూరి మాల్యాద్రి, సీపీఎం నాయకుడు శరత్ పాల్గొన్నారు.

అనుమానాస్పద లావాదేవీలపై నివేదికలు ఇవ్వాలి

బ్యాంక్‌ల నుంచి అనుమానాస్పద లావాదేవీలపై బ్యాంక్ అధికారులు ఎప్పటికప్పుడు నివేదికలివ్వాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. బ్యాంక్ అధికారులతో బుధవారం కలెక్టరేట్‌లో ఆయన సమీక్షించారు. నామినేషన్ వేసే అభ్యర్థులు కొత్తగా బ్యాంక్ ఖాతా తెరవటానికి బ్యాంక్ అధికారుల సహకరించాలన్నారు. ముఖ్యంగా బ్యాంక్ ఖాతాల నుంచి రోజుకు రూ.10 లక్షలు, అంతకంటే ఎక్కువ మొత్తంలో నగదు లావాదేవీలు జరిపిన వివరాలు ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు. నెలవారీగా రూ.50 లక్షలు, అంతకంటే ఎక్కువ మొత్తంలో లావాదేవీలను నివేదించాలన్నారు. అసాధారణమైన, అనుమానాస్పద నగదు ఉపసంహరణ లేదా బ్యాంక్‌లో నగదు డిపాజిట్ చేసే ఖాతాలపై దృష్టి పెట్టాలన్నారు. ఒకరి నుంచి ఆర్టీజీఎస్ లేదా రెమిటెన్స్ విధానంతో అనేకమంది వ్యక్తుల ఖాతాలకు అసాధారణమైన బదిలీపై నిఘా ఉంచాలన్నారు. జిల్లాలోని 256 బ్యాంక్ బ్రాంచ్‌ల లావాదేవీలపై నిఘా ఉందన్నారు సమావేశంలో డీఆర్‌వో సీహెచ్ సత్తిబాబు, ఎల్‌డీఎం శివకృష్ణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య, జిల్లాలోని ఆయా బ్యాంక్‌ల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి అతిక్రమిస్తే చర్యలు : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల, ఏప్రిల్ 10 : ఎఫ్ఎస్‌టీ బృందాలు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ నిత్యం అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా బుధవారం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నోడల్ పోలీసు అధికారులు, ఎఫ్ఎస్‌టీ బృందాలతో ఎస్పీ సమీక్షించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేందుకు జిల్లాలో మొత్తం 18 ఎస్ఎఫ్‌టీ బృందాలను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఎన్నికల నియమావళిని ఎవరు అతిక్రమించకుండా పరిరక్షించేందుకు ఈ బృందాలు 24/7 విధులు నిర్వహించేందుకు 216 మంది పోలీసు సిబ్బందిని నియమించటం జరిగిందన్నారు. సి-విజిల్‌యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులకు వెంటనే స్పందించి నిర్దిష్టసమయంలోపు ఎస్ఎఫ్‌టీ బృందాలు సమస్యాత్మక ప్రదేశానికి చేరుకొని ఆ సమస్యపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్రమ మద్యం, నగదు, బహుమతులు, ఇతరవస్తువుల అక్రమ రవాణను కట్టడి చేయటానికి ముఖ్యమైన కూడళ్ళు, ప్రదేశాలలో వాహనాల తనిఖీలు నిర్వహించాలన్నారు. అక్రమ మద్యం, నగదు, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయటానికి ఉపయోగించే వస్తువులు, బహుమతులు ఎక్కడైనా నిల్వ, రవాణా చేస్తున్న దానికి సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించుకుంటూ ఆ ప్రదేశాలలో సోదాలు నిర్వహించాలన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అభ్యర్థులు ర్యాలీలు, మీటింగ్‌లు నిర్వహిస్తున్న ప్రదేశాలను తెలుసుకొని అక్కడికి చేరుకొని వారు నిర్వహిస్తున్న ప్రచారాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఎన్నికల నియమావళి అతిక్రమించకుండా వీడియోలో చిత్రీకరించాలన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలు, రెస్టారెంట్‌లు తనిఖీ చేస్తూ ఉండాలన్నారు. సూచించిన సమయంలోపు వాటిని మూయకుంటే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. వీడియోగ్రాఫి తీస్తూ వాహన తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎఫ్ఎస్‌టీ బృందాలు సమర్ధవంతంగా విధులు నిర్వహించటానికి వారి వాహనాలకు జీపీఎస్ అమర్చటం జరిగిందన్నారు. ఎవరైనా ఎన్నికల విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. సమావేశంలో ఎలక్షన్ సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, సిహెచ్ సింగయ్య, జిల్లాలోని నోడల్ పోలీసు అధికారులు, ఎఫ్ఎస్‌టీ బృందసభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

నాటుసారా తయారీపై చర్యలు చేపట్టాలి

● సెబ్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ శ్రీనివాసులు

బాపట్ల, ఏప్రిల్ 10 : బాపట్ల మండలంలోని స్టూవర్టుపురం, వెదుళ్ళపల్లి, చిన బేతపూడి గ్రామాలలో నాటుసారా తయారు చేయకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సెబ్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాసులు ఆదేశించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సెబ్ కమిషనర్ ఎం.రవిప్రకాష్ ఆదేశాల మేరకు బుధవారం బాపట్ల సెబ్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ అధికారుల పనితీరును సమీక్షించారు. ఇప్పటి వరకు చేపట్టిన ముందస్తు చర్యలు గురించి అడిగి తెలుసుకొని ఆయా ప్రదేశాలలో చేసిన దాడులు గురించి సమీక్షించి తగు సూచనలు చేశారు. నాన్‌డ్యూటీ ఫైడ్‌లిక్కర్, అనధికార మద్యం విక్రయాలు, అక్రమ మద్యం నిల్వల గోదాముల సమాచారం సేకరించి దాడులు చేయాలని ఆదేశించారు. సారా, నాన్‌డ్యూటి ఫైడ్‌లిక్కర్, అనధికార మద్యం, పాతముద్దాయిలను బైండోవర్ చేసేందుకు, వారిపై పీడీ చట్టం ప్రయోగించేందుకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా బాపట్ల సీఐ వెంకటేశ్వరరావును ఆదేశించారు. రాబోవు ఎన్నికల సందర్భంగా సారా, మద్యం ప్రభావం ఎన్నికల మీద చూపకుండా ఫ్రీ అండ్ ఫెయిర్ ఎన్నికలు జరుపుటకు విధులను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారి సీహెచ్‌వీ మహేష్‌కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ గోవిందనాయక్, అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ప్రభాకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గోల్డ్ గోల్‌మాల్‌పై ఖాతాదారుల నిరసన

బాపట్ల, ఏప్రిల్ 10 : మూడేళ్ళక్రితం బాపట్లలోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో గోల్డ్ గోల్‌మాల్ అయ్యిందని, దీనికి సంబంధించిన సమస్య నేటి వరకు క్లియర్ చేయలేదంటూ ఖాతాదారులు బుధవారం బ్యాంక్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. బ్యాంక్ తాళాలు తీయకుండా అడ్డుకొని తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమకు వెంటనే న్యాయం చేయాలని లేకుంటే ఆత్మహత్యకు పాల్పడతామని కొంతమంది ఖాతాదారులు హెచ్చరించారు. పోలీసులు వచ్చి వారితో చర్చించి సమస్యను పరిష్కరించాలని బ్యాంక్ అధికారులకు సూచించారు. మొత్తం 49 మంది ఖాతాదారులు ఉన్నట్లు పట్టణ సీఐ యు.శ్రీనివాసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే... మూడేళ్ళ క్రితం 49 మంది బ్యాంక్ ఖాతాదారులకు సంబంధించిన బంగారు అభరణాలు అదే బ్యాంక్‌లో పనిచేసే ఉద్యోగులే మాయం చేశారు. దీనిని రికవరీ చేసిన బ్యాంక్ అధికారులు ఆరుగురు ఖాతాదారులకు సంబంధించిన బంగారం మాత్రం రికవరీ చేయలేకపోయారు. దీంతో వారికి బంగారం విలువ ప్రకారం డబ్బులిస్తామని చెప్పి ఒకరికి ఇచ్చి ఐదుగురికి ఆపటంతో వారు ఈ విధంగా ఆందోళనకు దిగినట్లు సమాచారం.

రాష్ట్ర ప్రయోజనం కోసమే కూటమి ఏర్పాటు

● మాజీ మంత్రి ఆనందబాబు



వరహాపురంలో ప్రచార రథంపై నుంచి ప్రసంగిస్తున్న ఆనందబాబు

వేమూరు, ఏప్రిల్ 10: రాష్ట్ర ప్రజల ప్రయోజనం కోసమే టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి ఏర్పాటు చేసినట్లు వేమూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు తెలిపారు. బుధవారం సాయంత్రం మండలంలోని వరహాపురం, కుచ్చెళ్ళపాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లో ప్రజలు ఆనందబాబుకు ఘన స్వాగతం పలికారు. పార్టీ అభిమానులు కార్యకర్తలు కేరింతలు కొడుతూ జయజయ ధ్వానాలు చేశారు. ఆనందబాబు ఓటర్లను కలుసుకుని ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచార రథంపై నుంచి మాట్లాడుతూ ప్రతి పథకాన్ని అర్హులైన వారందరికి చేరువ చేస్తూ ఆర్థిక పరిపుష్టికి తోడ్పడిన ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వమేనని అన్నారు. ఎం తో ప్రగతిని సాధించే తరుణంలో ఎన్నికలు రావడం జగన్మోహన్‌రెడ్డి తనకు ఒక్క ఛాన్సు ఇవ్వండి అని అడగడం, ప్రజలు ఆ ఒక్క ఛాన్సు ఇవ్వడం ద్వారా ప్రజలే కాకుండా రాష్ట్రం కూడా అధోగతిపాలైందని విమర్శించారు. తిరిగి రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, ప్రజలకు స్వపరిపాలన అందాలన్నా చంద్రబాబునాయు డు ముఖ్యమంత్రిగా రావడం ఎంతో అవసరం అన్నారు. కార్యక్ర మంలో బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త ఊసా రాజేష్, జనసేన జిల్లా కార్యదర్శి సోమరౌతు అనురాధ, నాయకులు తాడికొండ సుధీర్‌బాబు, గాజుల వెంకట సుబ్బయ్య, యల్లమాటి రాజేంద్ర, యల్లమాటి సుజాత, యల్లమాటి రాజు, వేమూరు మురళీకృష్ణ, అమ్మిశెట్టి కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



వరహాపురంలో ఆనందబాబుకు ఘన స్వాగతం పలుకుతున్న టీడీపీ, జనసేన శ్రేణులు



పార్టీ జెండాలతో ఎన్నికల ప్రచారం చేస్తున్న వేగేశన హరికుమారి, తెలుగు మహిళలు

ఎన్నికల ప్రచారంలో వేగేశన సతీమణి

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 10 : అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ బలపరిచి కూటమి అభ్యర్థులైన ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ, ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్‌లకు ఓటు వేసి ఆఖండ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ సతీమణి హరికుమారి ఓటర్లను అభ్యర్థించారు. మండలంలోని ఖాజీపాలెం అల్లూరు సీతారామరాజు విగ్రహం కూడలి నుంచి బుధవారం నాయుడుపాలెం, రాజులబజారు, కుమ్మరిపాలెం, మంగళపాలెం, ఖాజీపాలెం, జి.ఎన్‌పాలెం, పిట్టలవానిపాలెం, అలకాపురం తదితర గ్రామాలలో టీడీపీ నాయకులు, తెలుగు మహిళలతో కలిసి ఆమె ఇంటింటి కెళ్ళి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాల అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖాజీపాలెం మాజీ సర్పంచ్ మంతెన శ్రీదేవి కృష్ణమూర్తి రాజు, ఖాజీపాలెం టీడీపీ యువనాయులు కొత్తపల్లి పృధ్వీరాజు, ఖాజీపాలెం గ్రామ టీడీపీ అధ్యక్షుడు దండు శ్రీనివాసరాజు, ఖాజీపాలెం గ్రామ టీడీపీ మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వరరాజు, మెండు చంటి, టీడీపీ మండల అధ్యక్షుడు ఎండిఅప్జల్, టీడీపీ సీనియర్ నాయకుడు లక్ష్మంరాజు వెంకటపతిరాజు, టీడీపీ బాపట్ల పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ ఖాశీం, తెలుగు మహిళా మండల అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి, నియోజకవర్గ తెలుగుయువత ప్రధాన కార్యదర్శి కిషోర్‌రెడ్డి, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు కె.సాంబమూర్తిరాజు, శంకరరెడ్డి, మాజీ ఎంపీపీ సులోచన నారాయణ, పార్టీ నాయకులు చక్రధర్‌రెడ్డి, శ్రీనివాసరావు, చందోలు గ్రామ టీడీపీ నాయకులు సయ్యద్ నిజాం, టీడీపీ మండల బీసీసెల్ అధ్యక్షుడు పి.విష్ణువర్ధన్, మంతెనవారిపాలెం గ్రామ టీడీపీ అధ్యక్షుడు పి.మురళీ, మండల కోఆప్షన్ మాజీ సభ్యుడు డేవిడ్, చందోలు గ్రామ టీడీపీ అధ్యక్షుడు మహ్మద్ రజాక్‌పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల విజయం కోసం పని చేస్తాం

● అంటరానితన నిర్మూలన పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చార్వాక

బాపట్ల, ఏప్రిల్ 10 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయం కోసం పని చేస్తామని అంటరానితన నిర్మూలన పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.చార్వాక తెలిపారు. ఏఎన్‌పీఎస్ కార్యాలయంలో బుధవారం మాల సంఘాల జేఏసీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో దళితులకు జరిగిన అన్యాయం గురించి, రాజ్యాంగపరంగా రావాల్సిన హక్కులు కోల్పోవటంపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును జేఏసీ నాయకులు కలిసి వివరించటం జరిగిందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విదేశీ విద్య పేరు మార్చి జగన్ పేరు పెట్టుకోవటాన్ని తీవ్రంగా ఖండిస్తూ చంద్రబాబు దృష్టికి తీసుకెళ్ళగా కూటమి అధికారంలోకి రాగానే అంబేద్కర్ పేరు కొనసాగిస్తామని తెలిపారన్నారు. అదేవిధంగా రద్దు చేసిన 27 పథకాలను పునరుద్దరించాలని, ఎయిడెడ్ స్కూల్స్ పునఃప్రారంభించాలని, ప్రతి మండల కేంద్రంలో 5 ఎకరాలలో ఉమ్మడి శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని కోరటంతో అన్నిటికి చంద్రబాబు సానుకూలంగా స్పందించారన్నారు. రాబోయే ఎన్నికలలో మాలలమంతా కూటమితో కలిసి పని చేస్తామని చార్వాక తెలిపారు. సమావేశంలో మాలసంఘాల నాయకులు శీలం రోజన్‌బాబు, మంచాల ఆనంద్, గోళ్ళమూడి కిరణ్‌కుమార్, దాసరి లక్ష్మీ, గొర్రెముచ్చు వందనం తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి చెరువులను నింపాలి : ఎంపీడీవో

కర్లపాలెం, ఏప్రిల్ 10 : కర్లపాలెం మండలంలోని రక్షిత మంచినీటి చెరువులను నీటిని నింపేందుకు కృష్ణా కెనల్ ద్వారా నీటిని విడుదల చేస్తున్నారని చెరువులను నింపేందుకు ఆయా గ్రామాలకు సంబంధించిన టీమ్‌లు ఏర్పాటు చేశామని అధికారులందరూ అప్రమత్తమై మంచినీటితో చెరువులను నింపాలని ఎంపీడీవో నేతాజి తెలిపారు.

నిబంధనలను ఉల్లంఘించిన ఉపాధ్యాయులపై చర్యలు : డీఈవో

బాపట్ల టౌన్, ఏప్రిల్ 10 : పదిమూల్యాంకనంలో నిబంధనలను ఉల్లంఘించిన ఉపాధ్యాయులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని డీఈవో కె.నారాయణరావు తెలిపారు. ఆయన కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలోని జవాబుపత్రంలో విద్యార్థి రాసిన సమాధానాలు బహిరంగంగా తెలిసిన వారితో చర్చించినా, మూల్యాంకనంలో విద్యార్థికి వచ్చిన మార్కులు తెలియజేసినా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయులంతా మూల్యాంకన కేంద్రంలో జవాబుపత్రంలోని అంశాలను బహిరంగ పర్చకుండా అప్రమత్తంగా ఉండాలని లేకపోతే విద్యాశాఖాధికారులు తీసుకునే చర్యలకు బాధ్యులు అవుతారని తెలిపారు.

జమ్ములపాలెం, నరసాయపాలెంలో పోలీసు కవాతు

బాపట్లరూరల్, ఏప్రిల్ 10 : రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బాపట్ల మండలం జమ్ములపాలెం, నరసాయపాలెం గ్రామాలలో బుధవారం కేంద్ర సాయుధ బలగాలతో బాపట్ల రూరల్ సీఐ శ్రీహరి పోలీసు కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు గ్రామాలలోని ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. గ్రామాలలో గొడవలు, అల్లర్లకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

మద్యం తరలిస్తే ఉపేక్షించేది లేదు

రేపల్లె, ఏప్రిల్ 10: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా అనుమతి లేకుండా మద్యాన్ని సరఫరా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఈబీ డిప్యూటి కమిషనర్ కె.శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక సెబ్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో బాపట్ల జిల్లాలో సెబ్ పనితీరును పరిశీలించేందుకు అధికారులతో సమావేశం నిర్వహించామన్నారు. ఎన్నికల సమయంలో ఎన్‌ఫోర్స్‌మెం ట్ పనితీరును మెరుగుపరచుకోవాలని ఆయన సూచించారు. అక్రమ మద్యం సరఫరాను అరికట్టడానికి తీసుకోవాల్సిన తగు సూచనలను తెలియజేశారు. మద్యం నిల్వలను గుర్తించి కేసులు నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలనారు. కార్యక్రమంలో ఎస్‌ఈబీ అధికారులు పాల్గొన్నారు.

వేతనానికి తగిన విధంగా పని చేయాలి

● ఎంపీడీవో శేషగిరిరావు

వేమూరు, ఏప్రిల్ 10: ఉపాధి హామీ పనుల్లో పాల్గొని కూలీల కు కేంద్ర ప్రభుత్వం కనీస వేతనం రూ.300లకు పెంచింది. అందుకు తగినవిధంగానే కూలీలతో పనులు చేయించాలని వేమూ రు ఎంపీడీవో శేషగిరిరావు ఫీల్డ్ అసిస్టెంట్‌లను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 17 గ్రామాల పరిధిలో 35పనులు చేపట్టేందుకు ఆరు కోట్ల రూపాయలు మంజూరయ్యాయని అన్నారు. ఈనెల 1న ప్రారంభమైన పనులు త్వరగా పూర్తి చేయించాలన్నారు. 100రోజులు పని పూర్తి చేసి జాబ్ కార్డు కలిగిన కూలీలకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేసింది.

వ్యవసాయం, పశుపోషణ అం శాలపై ఐదు రోజుల శిక్షణ ఇస్తుంది. శిక్షణ సమయంలో స్టయిఫండ్ ఇవ్వడంతో పాటు శిక్షణ అనంతరం సర్టిఫికెట్లను ఇస్తారని తెలిపారు. గుంటూరు లాంఫారం ద్వారా జరిగే శిక్షణకు దరఖాస్తు చేసుకోదలచిన వారు ఫీల్డ్ అసిస్టెంట్లకు తమ దరఖాస్తుల ను అందించాలన్నారు. మండల పరిధిలో 40మంది సభ్యులు దరఖాస్తు చేస్తే మండల పరిషత్ కార్యాలయ పరిధిలోని శిక్షణ ఏర్పాటు చేస్తారన్నారు. పని ప్రదేశంలో వేసవి దృష్ట్యా టెంట్లు వేయించాలని మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ప్రథమ చికిత్స కిట్ల ను సిద్ధం చేసుకుని ఉంచాలని తెలిపారు. సమావేశంలో ఏపీవో సత్యకృష్ణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన వసంత నవరాత్రులు

భట్టిప్రోలు, ఏప్రిల్ 10: శుక్రవారోత్సవ కమిటీ ఆధ్వర్యంలో తొమ్మిదిరోజుల పాటు శ్రీరామనవమి వరకు లలితాపారాయణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకురాలు అరుణకుమారి తెలిపారు. ఒక్కో రోజు ఒక్కో గృహంలో పూజా కార్యక్రమాలను నిర్వహించి లలితా పారాయణ గావిస్తామన్నారు. చైత్ర నవరాత్రిని వసంత నవరాత్రిగా పిలుస్తారని ఈ నవరాత్రుల్లో దుర్గాదేవిని తొమ్మిది రోజులు తొమ్మిది రూపాల్లో అలంకరించి పూజలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మద్దుల నళిని, కాళంగి హేమలత, దర్శి శశికళ, తూనుగుంట్ల కన్యాకుమారి, సూర్యప్రభ, తూనుగుంట్ల శ్రీవాణి, ధనలక్ష్మి, సుజాత, శశికళ పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వసంత నవరాత్రి ఉత్సవాలు

వేమూరు, ఏప్రిల్ 10: మండలంలోని అబ్బనగూడవల్లి గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానాల సమరసతా సేవా ఫౌం డేషన్ ఆధ్వర్యంలో వసంత నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. సీతారామాంజనేయ ఆలయంలో కలశ ప్రతిష్ఠా పన జరిపి నిత్యం ధార్మిక ఉపన్యాసాలు, భజనలు, నగర సంకీర్తన కార్యక్రమాలతో పాటు హనుమత్ సీతాలక్ష్మణ సమేత కోదం డ రామస్వామి వారికి అభిషేకాలు, విశేష అలంకరణ పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. జంజనం హేమశంకరరావు పర్యవేక్షణలో జరుగుతున్న కార్యక్రమాల్లో బూరుగుల అరుణకుమారి, కూచిభట్ల శ్రీనివాసశర్మలు నిత్యం ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తున్నారు. ఈ ఉత్సవాలు శ్రీరామ నవమి వరకు జరుగుతాయని టీడీపీ ప్రచార కమిటీ సభ్యులు తెలిపారు.

అద్దేపల్లి ఆడెమ్మ తల్లి గ్రామోత్సవం

భట్టిప్రోలు, ఏప్రిల్ 10: తెలుగు సంవత్సరాది క్రోధి నామ సం వత్సర ఉగాదిని పురస్కరించుకుని బుధవారం అద్దేపల్లి గ్రామదేవత ఆడెమ్మతల్లి గ్రామోత్సవాన్ని పద్మశాలీయ సంఘం ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం ప్రత్యేక పూ జలు నిర్వహించి సాయంత్రం ప్రత్యేక వాహనంపై ఆశీనులను గావించి గ్రామపురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. గురువారం ఉదయం తెల్లవారుజామున ఆడెమ్మ తల్లిని దేవాలయాని కి చేర్చారు. గ్రామోత్సవాన్ని అద్దేపల్లి పద్మశాలీయ సంఘీయులు పర్యవేక్షించారు.

అమర వీరులకు నివాళి

కొల్లూరు, ఏప్రిల్ 10: భూపోరాటంలో అశువులు బాసిన అమ రవీరులకు సీపీఎం నాయకులు నివాళులర్పించారు. బుధవారం మండల పరిధిలోని గాజుల్లంకలో అమరవీరుల స్థూపం వద్ద బావిరెడ్డి వియ్యమ్మ, సనకా సుబ్బారావు, బావిరెడ్డి వెంకటేశ్వర్లు, మత్తి సుబ్బారావులకు సీపీఎం నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, మాజీ ఎంపీపీ అమృతలూరి కృపానందం, పార్టీ నాయకులు అగ్గిరామయ్య, బొనిగల అగస్టీన్, బి.సుబ్బారావు, సీపీఐ నాయకులు బావిరెడ్డి ప్రభాకరరావు, గ్రా మస్థులు గోపరాజు శివరామప్రసాద్, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

చినపులివర్రులో జయహో బీసీ సమావేశం

కొల్లూరు, ఏప్రిల్ 10: జయహో బీసీ సమావేశాన్ని టీడీపీ బీసీ నాయకులు నిర్వహించారు. బుధవారం రాత్రి మండలపరిధిలోని చిన పులివర్రులో నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు బట్టు మల్లికార్జునరావు పాల్గొని మాట్లాడుతూ బీసీలంతా ఐక్యతతో వచ్చే ఎన్ని కల్లో టీడీపీ కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబును అత్యధిక మెజారిటీతో గెలిపించి రాష్ట్రంలో టీడీపీ కూటమిని అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మైనేని మురళీకృష్ణ, డాక్టర్ కనగాల మధుసూదనప్ర సాద్, యలవర్తి కోటేశ్వరరావు, బీసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీలకు ఆదరణ పథకం పునరుద్ధరణ

అమృతలూరు, ఏప్రిల్ 10: బీసీలకు ఆదరణ పథకం పునరుద్ధరించనున్నట్లు టీడీపీ నాయకులు యలవర్తి బ్రహ్మానందం తెలి పారు. బుధవారం ప్యాపర్రులో జయహో బీసీ సదస్సు నిర్వహించారు. బ్రహ్మానందం మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్‌రెడ్డి రద్దు చేసిన పథకాలను తిరిగి ప్రారంభిస్తామన్నారు. చంద్రన్న బీమా రూ.10 లక్షలతో పునరుద్ధరణ చేస్తామన్నారు. కార్యక్రమంలో శరణు శేషగిరి, బి.ఆంజనేయులు, పి.వెంకటసుబ్బారావు, ఆచ్చన వెంకటేశ్వరరావు, తాతా నాగే శ్వరరావు, ఓలేటి వసంతరావు, స్థానిక నాయకులు, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచారం కోసం వచ్చి వెళ్లిపోయిన వైసీపీ అభ్యర్థి

వేమూరు, ఏప్రిల్ 10 : నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు అమృతలూరు బుధవారం ఉదయం వచ్చారు. ఇందుకోసం ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజన ఏర్పాటు చేశారు. కాని వరికూటి ప్రచారానికి వచ్చే సమయానికి ప్రజలు లేకపోవడంతో పార్టీ శ్రేణులపై తీవ్ర ఆగ్రహం వ్యక్త పరిచారు. కోపంతో ప్రచారం రద్దు చేసుకుని తిరిగి వెళ్లిపోయారు. కాగా సాయంత్రం తిరిగి చేపట్టిన ప్రచారంలో వరికూటి అశోక్‌బాబుతో పాటు, ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్ కూడా హాజరయ్యారు.



కారుమూరు వైసీపీ నాయకులకు టీడీపీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రానున్నది కూటమి ప్రభుత్వమే

● వైసీపీ నాయకులు టీడీపీలో చేరిక

రేపల్లె, ఏప్రిల్ 10: రాష్ట్రంలో జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసా ద్ అన్నారు. గురువారం నియోజకవర్గంలోని పలు మండలాల వైసీపీ నాయకులు టీడీపీలోకి ఎమ్మెల్యే అనగాని సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా అనగాని మాట్లాడుతూ రానున్నది ఎన్‌డీఏ ప్రభుత్వ కూటమేనని, 40 రోజులు ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేస్తే రానున్న 5 సంవత్సరాలల్లో జిల్లాలోనే రేపల్లెను ఉత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దే బాధ్యత నేను తీసుకుంటానన్నారు. పార్టీలో శ్రమించే ప్రతి కార్యకర్తకు సముచిత న్యాయం కల్పిస్తామన్నారు. జగన్‌రెడ్డి రాక్షసపాలనలో రాష్ట్రం 30 ఏళ్ళ అభివృద్ధిలో వెనకబడిందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల వారిపై అధి కభారం మోపారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీతోనే సాధ్యపడుతుందని ప్రతిఒక్కరూ అండగా నిలబడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పంతాని మురళీధరరావు, గూడపాటి శ్రీనివాసరావు, తాతా ఏడుకొండలు పాల్గొన్నారు.

ఇఫ్తార్‌లో

చెరుకుపల్లి మండలం, కనగాల గ్రామంలో రంజాన్ పండుగను పురస్కరించుకుని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ముస్లిం మైనార్టీలకు ఇఫ్తార్‌విందు ఇచ్చారు. ఆయన ముస్లింలందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇఫ్తార్‌లో ముస్లింలకు భోజనాలను స్వయంగా వడ్డించారు.



కనగాలలో ముస్లింలకు భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్య ప్రసాద్

తండ్రికి మద్దతుగా తనయుడి ప్రచారం

అమృతలూరు, ఏప్రిల్ 10: తండ్రి విజయం కోరుతూ తన యుడు ప్రచారం నిర్వహిస్తున్నాడు. నక్కా ఆనందబాబు తన యుడు నక్కా అఖిలేశ్ తండ్రి విజయం కోసం ముమ్మర ప్రచా రం చేస్తున్నాడు. బుధవారం మండలపరిధిలోని పాంచాళవరం లో ఆయన ఇంటింటికి తిరుగుతూ తన తండ్రికి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ ప్రచారంలో దూసుకుపోతున్నాడు. స్థానిక బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన వెంట స్థానిక నాయ కులు తదితరులున్నారు.

చేనేత పరిశ్రమ రక్షణకు చర్యలు తీసుకోవాలి

భట్టిప్రోలు, ఏప్రిల్ 10: చేనేత కార్మికుల వరుస ఆత్మహత్యల ను నివారించి చేనేత పరిశ్రమ రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ ఐ మునిలక్ష్మికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఆత్మహత్యలు చేసుకున్న నాగానంద, మల్లికార్జున కుటుంబాలకు రూ.50 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం చేనేత పరిశ్రమపై వేసిన జీఎస్టీని వెంటనే ఎత్తివేయాలని, రాష్ట్ర ప్రభుత్వం యార్న్ సబ్సిడీ, త్రిఫ్టు ఫండ్, పావలా వడ్డీ, రిబేటు, హెల్త్ స్కీమ్ తదితర సంక్షేమ పథకాలను తిరిగి కొనసాగించాల ని, ప్రతి చేనేత కార్మికుడికి రూ.2లక్షలు ముద్రలోన్లు ఇప్పించాల ని తదితర డిమాండ్లను పరిష్కరించాలని వినతిపత్రంలో కోరా రు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు మురుగుడు సత్యనారాయణ, దీపాల సత్యనారాయణ, నాయకు లు బట్టు నాగమల్లేశ్వరరావు, దొంతు కోటేశ్వరరావు, కౌలు రైతు సంఘం నాయకులు జి.నాగరాజు పాల్గొన్నారు.

జగన్ పాలనలో వ్యాపారులపై పెచ్చరిల్లిన దాడులు

● టీడీపీ అధికార ప్రతినిధి విజయబాబు



వ్యాపారులకు మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తున్న విజయబాబు, రాజేష్ తదితరులు

వేమూరు, ఏప్రిల్ 10: జగన్మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో దాడులు పెచ్చరిల్లాయని తద్వారా ప్రతి వ్యాపారి భయంతో వ్యాపారం చేసే పరిస్థితులు దాపురించాయని బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు ఆవేదన వ్యక్తపరిచారు. వేమూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు, బాపట్ల పార్లమెంటరీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌ల విజయాన్ని కోరుతూ బుధవారం వేమూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన ప్రత్యేకంగా వ్యాపారులను కలుసుకొని చంద్రబాబునాయుడు విడుదల చేసిన మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కొందరు వ్యాపారులు జగన్ పాలనలో తాము పడుతున్న ఇబ్బందులను వెలిబుచ్చుకున్నారు. విజయబాబు మాట్లాడుతూ జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి పాలనకు మద్దతు పలకాలని తద్వారా అన్ని వర్గాల వారికి మం చి చేకూరుతుందని అన్నారు. నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త ఊస రాజేష్ మాట్లాడుతూ జగన్ పాలన వల్ల చిన్న వ్యాపారులే కాకుండా బడా వ్యాపారులు కూడా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీల వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తాం : జేడీ శీలం

భట్టిప్రోలు, ఏప్రిల్ 10: ఏపీలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే యువతకు ఉద్యోగాలు కల్పించి నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామని బాపట్ల ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి జేడీ శీలం అన్నారు. భట్టిప్రోలులో ఎమ్మెల్యే అభ్యర్థి బూరగ సుబ్బారావుతో కలసి బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 2.25లక్షల ఉద్యోగాలను భర్తీ చే స్తామన్నారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యపడుతుందని రాజధానిగా అమరావతినే కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రం అభివృద్ధిబాటలో పయనించాలంటే కాం గ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని ప్రజలంద రూ మార్పు కోరుకుంటున్నారని అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యపడుతుందని ఎంపీ, ఎమ్మెల్యేలను భారీ మెజార్టీతో గెలిపించాలని జేడీ శీలం కోరారు. ఈ కార్యక్రమంలో వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బూరగ సుబ్బారావు, నాయకులు తాడికొండ వెంకటేశ్వరరావు, ఎన్ ఏడుకొండలు, యార్లగడ్డ గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాల వైఫల్యం కారణంగానే కార్మికుల ఆత్మహత్యలు

భట్టిప్రోలు, ఏప్రిల్ 10: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం కారణంగానే చేనేత కార్మికులు ఆత్మహత్యలు పాల్పడుతున్నారని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ ఆరోపించారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు చేనేత రంగంపై అవలంభిస్తున్న విధానాల ఫలితంగా పరిశ్రమ రోజు రోజుకు సంక్షోభంలో కూరుకుపోతుంద ని తద్వారా కార్మికులు ఉపాధిని కోల్పోతున్నారని ఆయన ఆవే ద న వ్యక్తం చేశారు. మూడు రోజులుగా రాయలసీమ జిల్లాలో ఇద్దరు చేనేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటన బాధాకరమన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికుల సంక్షేమానికి పథకాలన్నీ పునరుద్ధరించి చేనేత కార్మికులను ఆదు కోవాలని బాలాజీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి నాయకులు కొడాలి రామకోటేశ్వరరావు, జి.లక్ష్మీ, కె.వీరమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలపై జగన్ కక్ష సాధింపు..!

- వారి జీవితాల్లో మార్పు టీడీపీతోనే
- అభివృద్ధి..సంక్షేమమే లక్ష్యంగా కృషి
- వైసీపీ వికృత పాలనతో అంతా అస్తవ్యస్తం
- పథకాలను రద్దు చేసిన అధికార పార్టీ
- టీడీపీ కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే ఏలూరి
- సైకిలెక్కిన రాజుపాలెం, పోతుకట్ల గ్రామస్థులు


రాజుపాలెం ఎస్సీ కాలనీ, పోతుకట్ల వాసులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, ఏప్రిల్ 10: పేదలపై జగన్‌రెడ్డి కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతూ అనేక సంక్షేమ.. అభివృద్ధి పథకాలను రద్దు చేశారని, వైసీపీ వికృత చర్యలకు అనేక మంది పేదలు బలయ్యా రని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్య క్షుడు, ఎమ్మెల్యే, కూటమి అభ్యర్థి ఏలూరి సాంబ శివరావు అన్నారు. బుధవారం మార్టూరు మండ లం రాజుపాలెం, పర్చూరు మండలం పోతుకట్ల గ్రామాల నుంచి పలువురు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో క్యాంప్ కార్యాలయంలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వా నించారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ పేదల జీవితాల్లో మార్పు తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు. ప్రజా సంక్షేమం అభివృద్ధే టీడీపీ లక్ష్యమన్నారు. పేదలు ఆర్థికంగా, సా మాజికంగా, రాజకీయంగా ఎదిగేందుకు చంద్ర బాబు విశేష కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీలకు అనేక సంక్షేమ పథకాలను రద్దుచేసి వారి జీవితాలను అంధ కారంలోకి నెట్టారని ఏలూ రి మండిపడ్డారు. ప్రజా సంక్షే మాన్ని విస్మరించి అభివృద్ధిని విధ్వంసం చేసిన జగన్ అండ్ కోకు గుణపాఠం చెప్పే రోజులు వచ్చాయన్నారు. ఓటు విలు వేంటో వైసీపీకి చెప్పాలని ఏలూరి విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలం తా సంఘటితంగా ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఏలూరి కోరారు. కలిసి వచ్చే వ్యక్తులు, పార్టీల తో ముందుకెళ్లి..వైసీపీని సాగనంపుదామన్నారు.

రాజుపాలెంలో చేరికలు..

మార్టూరు మండలం రాజుపాలెంకు చెందిన పలువురు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఏలూరి సాధరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో చల్లమాచర్ల యోహాను, ఏటగిరి ప్రసాద్, ఏటగిరి సముద్రాలు, పొట్లూరి సుధాకర్, మిల్లిక కార్తీక్, పూనూరి రాజు, కరవతి నారాయణ, ఏటగిరి రాకేష్, పూనూరి సీతమ్మ, పొట్లూరి అరుణ, పూనూరి రాధ, పొట్లూరి మల్లేశ్వరి, ఐమాల కిషోర్, ఉయ్యాల అంకమ్మ, నాగరాజు, హుస్సేన్, గంజి పెద్దవీరయ్య తదితరులు ఉన్నారు.

పోతుకట్ల నుంచి పార్టీలోకి..

పర్చూరు మండలం పోతుకట్ల గ్రామానికి చెందిన పలువురు ఏలూరి సమక్షంలో సైకిల్ ఎక్కారు. వారిలో తెలగతోటి మహేష్, మద్దు ఏలియా, దాసి అన్వేష్, శేషుబాబు, సందీప్, రావూరి సతీష్, మద్దు వంశీ, రావూరి లోకేష్, మిండ్యాల నాగరాజు, గండికోట నాగేశ్వరావు ఉన్నారు.

అబద్ధపు హామీలతో మోసగించిన జగన్‌రెడ్డి

- అధికారంలోకి వచ్చాక యథేచ్ఛగా దోపిడీ
- రాష్ట్రం బాగుపడాలంటే టీడీపీ రావాలి
- ఎమ్మెల్యే గొట్టిపాటి


టీడీపీలో చేరిన వల్లాపల్లి మాజీ సర్పంచ్ అల్లాఉద్దీన్

అద్దంకి. ఏప్రిల్ 10 : గత ఎన్నికల్లో జగన్‌రెడ్డి అబద్ధపు హామీలతో అన్ని వర్గాల ప్రజలను మోసగించారని, అధికారంలోకి వచ్చాక యథేచ్ఛగా దోపిడీకి పాల్పడ్డారని కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. బుధవారం అద్దంకి గోవాడ, సాధునగర్‌లో ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రైతుల భూములతో వైసీపీ ప్రభుత్వం ఆటలాడుకుం టుందన్నారు. భూసర్వే పేరిట రైతుల తాత తండ్రుల నుంచి వచ్చిన పొలాల్లో జగన్ పేరుతో హద్దు రాళ్ల ఏర్పాటు చేయడం దుర్మార్గమన్నా రు. మళ్లీ జగనొస్తే రైతుల భూములు తాకట్టు పెడతారని గొట్టిపాటి ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు, ప్రజలు అప్రమత్తంగా.. విజ్ఞతతో కూట మి అభ్యర్థులను గెలిపించాలన్నారు. రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు రావాలన్నారు. రైతులు అప్రమతంగా ఉండి టీడీపీని గెలిపించాలన్నారు. బస్సు యాత్రలతో మరోసారి ప్రజలను ముంచేందుకు జగన్‌రెడ్డి సిద్ధమయ్యారన్నారు. మద్యం నిషేధించాకే వస్తానని చెప్పి మాట తప్పిన జగన్‌ను ఇంటికి పంపాలన్నారు. అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు మరికొద్ది రోజులే గడువు ఉందన్నారు. 20 ఏళ్లుగా పార్టీలకు అతీతంగా మీకు సేవ చేస్తున్నానని, తనను మళ్లీ ఆశీర్వదించి సేవ చేసుకునే భాగ్యాన్ని కల్పించాలని రవికుమార్ కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, కఠారి నాగేశ్వరరావు, మానం మురళీమోహన్‌దాస్, కరి పరమేష్, సాంబయ్య, కొండలు, స్వాములు పాల్గొన్నారు.


గోవాడలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి

టీడీపీలో చేరిన వల్లాపల్లి మాజీ సర్పంచ్

బల్లికురవ : వల్లాపల్లిలో వైసీపీకి షాక్ తగిలింది. గ్రామ మాజీ సర్పంచ్ షేక్ అల్లాఉద్దీన్ తన అనుచరులతో కలిసి బుధవారం చిలకలూరిపేటలో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఇంటికి వెళ్లి అయన మద్దతు తెలిపారు. వైసీపీ వీడి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి గొట్టిపాటి కండువాలు వేసి ఆహ్వానించారు. ముస్లింలకు టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. గ్రామ పార్టీ నేతలు చింతల రామారావు, అమరనాథ్, పత్తిపాటి వెంకట్రావు ఉన్నారు.


మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవీందర్

ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి

పర్చూరు, ఏప్రిల్ 10: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నిలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని పర్చూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి గంధం రవీందర్ అన్నారు. బుధవారం రెవెన్యూ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నికల నియమావళిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పారదర్శకంగా ఎన్నిలను నిర్వహించడమే ఉద్యోగుల కర్తవ్యం అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే అట్టివారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో పర్చూరు తహసీల్దార్ సీహెచ్.సుబ్బయ్య, చినగంజాం తహసీల్దార్ జీవీఎం ఫణీంద్రబాబు, కారంచేడు తహసీల్దార్ మెహర్‌బాబు, యద్దనపూడి తహసీల్దార్ వై.నాగరాజు, ఇంకొల్లు తహసీల్దార్ ఎం.ప్రమీల, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ద్రోణాదుల రెస్టారెంట్ వద్ద ఘర్షణ

రెండు కేసులు నమోదు

మార్టూరు, ఏప్రిల్ 10: మండలంలోని ద్రోణాదుల గ్రామంలో రాయల్ రెస్టారెంట్ వద్ద మంగళవారం రాత్రి జరిగిన ఘర్షణలో బాధితుల ఫిర్యాదు మేరకు బుధవారం రెండు కౌంటర్ కేసులను నమోదు చేసినట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. అందుకు సంబంధించిన వివరాలిలావున్నాయి. మంగళవారం రాత్రి మండలంలోని కోలలపూడి గ్రామానికి చెందిన మల్లెల శివకృష్ణ తన కుమారుడి పుట్టిన రోజు సందర్భంగా గ్రామంలోని సరిమల్ల వేణు, మల్లెల నవీన్, గాలి రాజ్ కుమార్, గాలి ఏసుబాబు, సురభి షడ్రక్, గణపవరపు సుధీర్‌తో ద్రోణాదుల గ్రామంలోని రాయల్ రెస్టారెంట్ వద్దకు వెళ్లారు. అయితే అక్కడ సరిమెళ్ల వేణుకు రెస్టారెంట్ యజమాని పాలెపు వెంకటరావు, అతని కుమారుడు రామాంజనేయులుకు గతంలో ఫుడ్ బిల్లులు ఇవ్వలేదనే కారణంగా దానిపై వారి మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో రెస్టారెంట్ యజమానితో పాటు సిబ్బంది తమపై కులంపేరుతో దూషించి దాడి చేయగా గాయపడి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సురభి షడ్రక్, గణపవరపు సుధీర్‌లు స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అదేవిధంగా రెండో కేసులో రెస్టారెంట్ యజమాని పాలెపు రామాంజనేయులు అతని తండ్రి వెంకటరావు కోలలపూడి గ్రామానికి చెందిన సరిమెళ్ల వేణుతో పాటు 6 గురు వ్యక్తులు రెస్టారెంట్ లోని కుర్చీలు, బల్లలను పగులగొట్టారని, అంతేగాకుండా తమపై వంట సిబ్బందిపై దాడి చేయగా, గాయపడి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుననట్లు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ రెండు వర్గాల నుంచి అందిన ఫిర్యాదు మేరకు రెండు కేసులను నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గెలుపు మనదే.. అశ్రద్ధ వద్దు

శ్రేణులకు కూటమి అభ్యర్థి కొండయ్య దిశానిర్దేశం


వార్డుల కమిటీలతో మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి కొండయ్య

చీరాల, ఏప్రిల్ 10 : గెలుపు మనదే. అందులో ఎలాంటి సందేహం లేదు. అలా అని ఎక్కడా అశ్రద్ధ వద్దని నాయకులు, కార్యకర్తలకు కూటమి అభ్యర్థి ఎంఎం కొండ య్య పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో బుధవారం 33 వార్డుల కమిటీల బాధ్యులతో కొండయ్య సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వార్డులో ఇంటింటికీ ఎన్ని ఓట్లు ఉన్నాయి. వాటిలో సింహభాగం సైకిల్‌కు పడేలా ఏం చేయాలన్నదానిపై పక్కా వ్యూహంతో వ్యవహరించాలన్నారు. ప్రతి ఓటూ కీలకమన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు సానుభూతిపరులు, తటస్థులు మనతో ప్రయాణం చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. అందుకు సంబంధించి పలు సూచనలను కొండయ్య చేశారు. కూటమికి ఎక్కడెక్కడ బలంగా ఉన్నదీ.. ఎక్కడెక్కడ మధ్యస్థంగా బలహీనంగా ఉందో గుర్తించి ఆ ప్రాంతాల్లో ఓటర్లను మనవైపు తిప్పుకునేం దుకు చర్యలు చేపట్టాలన్నారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. ఉమ్మడిగా ఎలా ప్రయా ణం చేయాలి, ఒంటరిగా క్షేత్ర స్థాయిలో ఎవరెవరు ఏఏ బాధ్యతలు నిర్వహిస్తే ఎలాంటి సత్ఫలితాలు వస్తాయనే అంశంపై ప్రత్యేకంగా చర్చించారు. అంతిమంగా మనం గెలుపు లక్ష్యంగా ముందుసాగాలన్నారు. భవిష్యత్ కా ర్యాచరణపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు నాతాని ఉమామహేశ్వరరావు, గౌరీఅమర్‌నాథ్, యాసిన్, గజవల్లి శ్రీనివాసరావు, 33 వార్డుల అధ్యక్షులు పాల్గొన్నారు.

పాలేటి, మహేంద్రనాథ్ సమక్షంలో పార్టీలో చేరికలు

వేటపాలెం మండల పాపాయిపాలెంలో బుధవారం మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు, మహేంద్రనాథ్ సమక్షంలో గ్రామ మాజీ సర్పంచ్ పులి వెంకటేశ్వర్లు మరికొందరు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి అభ్యర్థి కొండయ్య గెలుపుకు కృషి చేయాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో గవిని పోతురాజు, సిహెచ్. వెంకటేశ్వర్లు, పులి శ్రీనివాసరావు, పులి తిరుపతి రావు, గొర్ల చక్రపాణి, గవిని ప్రసాద్, గొర్ల కృష్ణ మూర్తి, రాజు ఉన్నారు.

ఇఫ్తార్ విందులో..

నవాబుపేటలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో కొండయ్య పాల్గొన్నారు. తరువాత వేటపాలెంలో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఆయా సందర్భాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలకు ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కొండయ్య వెంట శ్రేణులు పాల్గొన్నారు.

జయహో బీసీ నినాదాన్ని చాటండి

నియోజకవర్గంలో జయహో బీసీ నినాదాన్ని చాటిచెప్పాలని కొండయ్య పిలుపునిచ్చారు. మండలంలోని వాడరేవు పంచాయతీ పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో అభ్యర్థి కొండయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ డిక్లరేషన్‌తో బీసీలకు పొందే లబ్ధి, ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

18 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక

చీరాల, ఏప్రిల్ 10 : సెయింట్ ఆన్స్ కళాశాలలో ఇటీవల ఒయాసిస్ ఆటోమేషన్ టెక్నాలజీస్ వారు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 18 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రతినిధులు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.జగదీష్, అక్రిడేషన్స్ డైరెక్టర్ డాక్టర్ సీ. సుబ్బారావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

150 మందికి దంత పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

అడుసుమల్లి(పర్చూరు), ఏప్రిల్ 10 : పర్చూరు మండలం అడుసుమల్లి గ్రామంలో పబ్లిక్ హెల్త్ డెంటిస్టు విభాగం, సిబార్ దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో డాక్టర్ దేవకి, డాక్టర్ శ్రీలేఖ సారథ్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 150 మందికి దంత పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈసదర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ వర్చస్వీ వెల్లంకి మాట్లాడుతూ దంత సమస్యలపై అశ్రద్ధ చేయకూడదని, కొద్దిపాటి సమస్య వచ్చినా వైద్యుడిని సంప్రదించాలన్నారు. గ్రామీణ రోగులకు ఉచిత వైద్య సేవలు అందించాలన్న సంకల్పంతో ఈశిబిరాన్ని ఏర్పా టు చేసినట్లు చెప్పారు. శిబిరానికి సహకారం అందించిన అడుసుమల్లి ఎల్ఎస్‌సీఎస్ (సొసైటీ) ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నరిశెట్టి వెంకటరమణ, దొప్పలపూడి రమాదేవి, దొప్పలపూడి శ్రీను, నరిశెట్టి విపెన్, వెల్లంకి బ్రదర్స్, గ్రామస్థులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి సాయం

అద్దంకిటౌన్, ఏప్రిల్ 10: వంట పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కనపర్తి రాజేశ్వరి కుమార్తె చదువుకు దాతలు ఆర్థిక సాయం అందజేశారు. అద్దంకిలోని ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినికి ప్రతి ఏటాలాగే రూ.16వేలు సేకరించి దాతలు అందజేశారు. బాలిక చదువుకోసం సమకూర్చిన నగదును కళాశాల డైరెక్టర్‌కు బుధవారం అందజేశారు.

ఎన్నికలకు అప్రమత్తంగా ఉండాలి


రికార్డులను పరిశీలిస్తున్న శ్రీనివాసులు

చీరాల, ఏప్రిల్ 10 : ఎన్నికల నేపథ్యంలో ఎస్ఈబీ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసులు చెప్పారు. ఎస్ఈబీ కమిషనర్ ఎం. రవిప్రకాష్ ఆదేశాల మేరకు డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు బుధవారం స్థానిక కార్యాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ కే ప్రభాకరరావు, చీరాల, పర్చూరు సీఐలు కర్ణ తదితరులకు ఆ ఉత్తర్వులను తెలిపారు. మద్యం అక్రమ నిల్వలు, నాన్ డ్యూటీపెయిడ్ లిక్కర్ రవాణా విక్రయాలు, మద్యం తయారీ, అక్రమ రవాణా, విక్రయాలు తదితరాల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికల ప్రలోభాల్లో భాగంగా ఎవరైనా డ్యూటీ పెయిడ్ లిక్కర్ పంపిణీ చేసినా కూడా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : గ్రామాల్లో మద్యం అక్రమ నిల్వలు, అమ్మకాలపై నిఘా ఉంచాలని ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఎస్ఈబీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఆయనతోపాటు ఎస్ఈబీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ప్రభాకరరావు, ఎస్ఐ వీ సైమన్, సిబ్బంది ఉన్నారు.

నేడు రైతులతో ఆత్మీయ సమావేశం

మార్టూరు, ఏప్రిల్ 10 : కృషి జీవన్ ఆధ్వర్యంలో గాండీవ రైతు ఉత్పత్తిదారుల సంస్థ సహకారంతో చిరుధాన్యాల ప్రాముఖ్యతపై స్థానిక విజయలక్ష్మి కల్యాణ మండపంలో గురువారం సాయంత్రం రైతులతో ఆత్మీయ సమావే శం నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పీ శరత్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పశు పోషకులకు ఆచార్య ఎన్‌జీ రంగా రైతు పురస్కారంతో సత్కరిస్తామన్నారు. ముఖ్య అతిథులుగా ఫౌండర్ ఆఫ్ ప్రకృతి వనం ఎంసీవీ ప్రసాద్, అఖిల భారత కిసాన్ సంఘ్ కారణి స దస్య జె కుమారస్వామి విచ్చేస్తున్నారన్నారు. మార్టూరు ప్రాంత రైతులు పశు పోషకులు కార్యక్రమానికి హాజరుకావాలని శరత్‌బాబు కోరారు.

ప్రపంచ హోమియో దినోత్సవం

అద్దంకిటౌన్, ఏప్రిల్ 10: ప్రపంచ హోమియో దినోత్సవం సందర్భంగా బుధవారం అద్దంకిలో త్రిమూర్తులు కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా హోమియో పితామహుడు డాక్టర్ శామ్యూల్ హనిమాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హోమియో వైద్యం, దాని ప్రాధాన్యతను హోమియో వైద్యులు డాక్టర్ కావూరి రఘుచంద్ వివరించారు. వడదెబ్బ తగలకుండా ఉండేందుకు హోమియో మాత్రలను చెన్నెబోలు వెంకట సుబ్బయ్య పంపిణి చేశారు. కార్యక్రమంలో అద్దంకి పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు, చంద్ర, మరియదాస్, శ్రీను పాల్గొన్నారు.


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

చీరాలటౌన్, ఏప్రిల్ 10 : ఓటు ప్రతి ఒక్కరి హక్కు. అని 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని ఎస్ఐ మురళి అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం పట్టణంలో బీఎస్ఎఫ్ పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పోలీసులకు ప్రజలు సహకరించాలని ఎస్ఐ మురళి కోరారు. కార్యక్రమంలో వన్‌టౌన్ స్టేషన్ సిబ్బంది, ప్రత్యేక బలగాలు పాల్గొన్నారు.

సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులు

- అవస్థలు పడిన ప్రయాణికులు
- రాజకీయ కార్యక్రమాలకు ప్రజా వాహనాల తరలింపుపై ఆగ్రహం


బస్సులు లేక బస్టాండ్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

అద్దంకి, ఏప్రిల్ 10 : సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులను తరలించడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. అద్దంకి డిపోకు చెందిన 27 పల్లె వెలుగు బస్సులను పల్నాడు జిల్లాలో బుధవారం జరిగిన ముఖ్యమంత్రి మేం సిద్ధం కార్యక్రమానికి పంపారు. దీంతో అద్దంకి డిపో పరిధిలోని పలు గ్రామీణ ప్రాంతాలకు బస్సు సర్వీసులు రద్దయ్యాయి. ప్రధానంగా వినుకొండ, పొదిలి, ఇంకొల్లు రూట్లలో అద్దె బస్సులు నడిపిస్తుండగా, మిగిలిన అన్ని గ్రామీణ రూట్లలో బస్సులన్నీ రద్దు చేశారు. విషయం తెలియ డిపోల వద్ద, రోడ్లపై గ్రామాలకు వెళ్లే ప్రయాణికు బస్సుల కోసం ఎండలో వేచి చూడాల్సిన పరిస్థితి ఎదురైం ది. జగన్‌రెడ్డి సభకు బస్సులు వెళ్లిపోయాయని తెలియడంతో చేసేది లేక ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. ఇదిలావుండగా పిడుగురాళ్లలో సీఎం సభ జరుగుతుండగా నామ్ రోడ్డులో నడిచే లారీలను మేదరమెట్ల - అద్దంకి వద్ద నిలిపి వేశారు. దీంతో గంటల సమయం వాహనాలు నిలిచిపోవడంతో ఎండకు డ్రైవర్లు అల్లాడిపోయారు. శుక్రవారం కూడా గుంటూరు జిల్లాలో జరిగే జగన్ సభకు ఆర్టీసీ బస్సులను కేటాయించారు. ఆరోజు కూడా ప్రయాణికులకు తిప్పలు తప్పవని పలువురు అంటున్నారు. రాజకీయ సభలకు ప్రజా రవాణా వాహనాలను తరలించడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గొట్టిపాటిని గెలిపించండి


కుందుర్రులో ప్రచారం చేస్తున్న హర్షవర్ధన్

ముప్పవరంలో చాయ్ విత్ హర్షవర్ధన్

పంగులూరు, ఏప్రిల్ 10 : మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికలలో కూటమి అభ్యర్థి తన తండ్రి గొట్టిపాటి రవికుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని గొట్టిపాటి హర్షవర్ధన్ కోరారు. మండలంలోని ముప్పవరం గ్రామంలో బుధవారం చాయ్ విత్ హర్షవర్ధన్ కార్యక్రమంలో భాగంగా ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీ దుకాణాలు, ఇతర వ్యాపార సముదాయాలకు వెళ్లి టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. చంద్రబాబు ప్రభుత్వం వస్తే అమలు చేసే పథకాలు, వాటి ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రైతులు, ప్రజలను కలిసి సమస్యలు తెలుసుకుంటున్న హర్షవర్ధన్ టీడీపీ అధికారంలోకి రాగానే సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. సుభిక్ష పాలన, రాష్ట్ర అభివృద్ధి, యువ తకు ఉద్యోగ అవకాశాలు చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. అన్ని వర్గాల ప్రజలు కూటమి అభ్యర్థులను ఆశీర్వదించాలని హర్షవర్ధన్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు రావూరి రమేష్, కుక్కపల్లి ఏడుకొండలు, కేవీ సుబ్బారావు, చింతల సహదేవుడు, బ్రహ్మానందస్వామి, బొరెడ్డి ఓబుల్‌రెడ్డి, వరపర్ల సుబ్బారావు, జగన్మోహనరావు, నార్నె సుబ్బారావు, కాజా, అమృతపూ డి, శ్రీనివాసరావు, రాధాకృష్ణ, నాగిరెడ్డి, ఆదిరెడ్డి, శివరాజు, అశోక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కొత్తూరులో ప్రచారం చేస్తున్న కమల్‌కిషోర్

వలంటీర్ల వ్యవస్థను బలపోతం చేస్తాం

బల్లికురవ : టీడీపీ అధికారంలోకి వలంటీర్ల వ్యవస్థను బలోపేతం చేయడంతోపాటు రూ.10వేల వేతనం ఇస్తుందని టీడీపీ యువతనేత గొట్టిపాటి కమల్‌కిషోర్ (బాబీ) తెలిపారు. బుధవారం కొత్తూరులో కూటమి అభ్యర్థి గొట్టిపాటి కోసం ప్రచారం నిర్వహించారు. వలంటీర్లు ఈ విషయాన్ని అర్థం చేసుకొని ప్రజల కోసం పనిచేయాలని కోరారు. జగన్‌రెడ్డి మరోసారి ప్రజలను మోసగించేందుకు, రాష్ట్రాన్ని దోచుకునేందుకు వస్తున్నారని, ప్రజలు అప్రమత్తమై ఎన్నికల్లో ఓటుతో తరమేయాలని పిలుపునిచ్చారు. అయనవెంట పెంట్రాల అంజనేయులు, దొడ్డా వేణుగోపాల్,శ్రీనివాసరావు రామకోటేశ్వరరావు

సంతమాగులూరు : పతనమైన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలోపెట్టే సమర్థుడు చంద్రబాబు అని, అయన్ని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడం ప్రజల బాధ్యత అని టీడీపీ యువనాయకుడు గొట్టిపాటి హర్షవర్ధన్ విజ్ఞప్తి చేశారు. కుందుర్తి గ్రామంలో కూ టమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌ను గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. టీడీపీకి ఓటేసి రాష్ట్ర భవిష్యత్‌ను కాపాడాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో జనసేన, బీజేపీ నాయకులు గాడిపర్తి వెంకట్రావు, దూపాటి ఏసోబు,రమేష్, వాసిరెడ్డి, ఏడుకొండలు పాల్గొన్నారు.

ఏలూరికి ఓటేయండి

మార్టూరు : కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును భారీ మెజార్టీతో గెలిపించాలని బుధవారం మార్టూరులో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. సంపత్‌నగర్, ఎంఎల్ఏపీ కాలనీ, కాకతీయనగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అమలు చేసే పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జంపని శ్రీను, గన్నవరం బుడేకాకోలు వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి రమాదేవి, శారద, కస్తూరి, అరుణ పాల్గొన్నారు.